
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5


సోమవారం 10 మార్చి 2025

101 ఫైర్‌స్టేషన్ నెంబరు

108 వైద్య సహాయానికి టోల్‌ఫ్రీ నెంబరు

అగ్గిరేగితే.. ఆర్పేదెలా?

అరకొరగానే అగ్నిమాపక సేవలు





పిడుగురాళ్ల అగ్నిమాపక కేంద్రంలో పాడుపడటంతో ప్రక్కన పడేసిన వాహానం

ఆంధ్రజ్యోతి ఫోకస్

ప్రతిపాదనలకే పరిమితం

ప్రభుత్వ నిబంధనల మేరకు 50 వేల జనాభాకు ఒక శకటం అవసరం. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కడా కూడా ఆ పరిస్థితి లేదు. పది పదిహేనేళ్ల క్రితమే అగ్నిమాపక కేంద్రాలతో పాటు, ఉన్న వాటిలో రెండో శకటం కోసం ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా కొత్తగా కేంద్రాల మంజూరును పక్కన పెడితే ఫైర్ ఇంజన్ల ఊసే లేదు. దీంతో వేసవిలో అత్యధిక ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో మంటల్లో ఆస్తులు మసవుతున్నాయి. ఆ సమయాల్లో నాయకులు, అధికారులు కంటి తుడుపు చర్యగా బాధితులకు సాయం అందించి చేతులు దులుపుకుంటున్నారే కానీ అగ్నిమాపక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కనీస ప్రయత్నాలు చేయడంలేదు.



నరసరావుపేట ఫైర్ స్టేషన్

ఆస్తులు .. బూడిదే

ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక శకటం చేరేసరికి పూర్తి నష్టం వాటిల్లుతుంది. జిల్లాలో అనేక మండలాల్లో ఫైర్‌ఇంజన్ అందుబాటు లో లేదు. అగ్నిమాపక కేంద్రానికి సమా చారం అంది వారు అక్కడకు వెళ్లేప్పటికి మంటల్లో ఆస్తులు బూడిదగా మారుతున్నాయి. ఎక్కడైనా ఒకే సమయంలో రెండు ప్రాంతాల్లో మంటలు అంటుకుంటే ఒకటి పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి కూడా నెలకొంది.

వేధిస్తోన్న సిబ్బంది కొరత

అగ్నిమాపక శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఒక్కో కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్లు ముగ్గురు, ఫైర్‌మెన్లు 9 మంది, డ్రైవర్లు ముగ్గురు, ఒక స్టేషన్ ఆఫీసరు ఉండాలి. అయితే ఏ స్టేషన్లోనూ 40 శాతం మంది సిబ్బంది కూడా లేరు. ఈ పరిస్థితుల్లో అగ్నిమాపకే కేంద్రానికి సమాచారం అందిస్తే.. అది చేరుకునేలోగా నష్టం జరిగిపోతుంది. ప్రమాద స్థలికి చేరుకోవడంలో కీలకంగా ఉండే డ్రైవర్లు ఏ స్టేషన్ లోనూ లేరంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. ఏళ్లుగా సిబ్బంది భర్తీకి నోచుకోలేదు. తాత్కాలిక ప్రాతిపదికన హోమ్ గార్డులను తీసుకున్నా వారికి పని నేర్చుకోలేక అధికారులు సతమత మవుతున్నారు.

సమర్థంగా ఎదుర్కొంటాం

జిల్లాలో ఎటువంటి అగ్ని ప్రమాదాలు, విపత్తులు సంభవించినా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. కాల్ వచ్చిన కొన్ని నిమిషాల్లోనే ప్రమాదం జరిగిన ప్రాంతానికి అగ్నిమాపక వాహనాలు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నాం. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూసేందుకు అన్ని చర్యలు చేపట్టాం. ప్రజలు కూడా అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా ఉండరాదు.

- ముక్కు శ్రీనివాసరెడ్డి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి, గుంటూరు



● రేకుల షెడ్డులో ఉన్న చిలకలూరిపేట అగ్నిమాపక కేంద్రం

ఎండా కాలం.. అంటే మండే కాలం. అగ్నిప్రమాదాలకు అత్యధికంగా అవకాశం ఉన్న సమయం. భానుడి భగభగలకు తోడు అగ్గి సులభంగా రేగుతుంటోంది. ఏటా అగ్నిప్రమాదాల్లో రూ.కోట్ల లో ఆస్తి నష్టంతో పాటు ప్రాణాలు కూడా పోతుంటాయి. అగ్నిప్రమాదాల నివారణకు అత్యాధునిక యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చిన వాటిని అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది అనేందుకు జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల దుస్థితి చూస్తే అర్థమవుతోంది. అగ్గి రేగితే ఆస్తులు బుగ్గి అవుతున్నా.. అగ్నిమాపక వ్యవస్థను పటిష్ఠం చేయడంపై ప్రభుత్వం పెద్దగా దృష్టి సారించడం లేదనేందుకు సిబ్బంది, సౌకర్యాల కొరత, మరమ్మతులతో మొరాయించే ఫైర్‌ఇంజన్లు నిదర్శనంగా కనిపిస్తాయి. జిల్లా, మున్సిపల్ కేంద్రాలు తప్పించి మరెక్కడా కూడా అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. అవి కూడా అత్యాధునికంగా ఉన్నాయా అంటే అనుమానమే. ఎప్పుడో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రాలు.. ఏళ్ల క్రితం కేటాయించిన ఫైర్ ఇంజన్లతో అరకొర సేవలతో కాలం వెళ్లదీస్తున్నాయి. అగ్నిమాపక కేంద్రం పరిధిలో పదుల కిలోమీటర్ల దూరంలో జరిగే ప్రమాదాలకు వాహనాలు వెళ్లే సరికి ఆస్తులు బుగ్గవుతున్నాయంటే జిల్లాలో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- మరమ్మతుల్లో పలు అగ్నిమాపక శకటాలు
- మండలాలకు సుదూరంలో అగ్నిమాపక కేంద్రాలు
- సకాలంలో ప్రమాదస్థలికి చేరుకోలేకపోతున్న ఫైర్‌ఇంజన్లు
- అగ్నిమాపకశాఖను వెంటాడుతున్న సిబ్బంది, సౌకర్యాల కొరత

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, మార్చి 9: వేసవి అగ్ని ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉండేకాలం. అయితే జిల్లాలో అగ్నిమాపకశాఖ పరిస్థితి అధ్వానంగా ఉంది. సిబ్బంది కొరత.. సౌకర్యాల లేమి.. డొక్కు వాహనాలతో అగ్ని ప్రమాదాలను వంద శాతం నివారించలేని విధంగా ఉంది. జిల్లాలోని పలు అగ్నిమాపక కేంద్రాల పరిధిలో పదుల సంఖ్యలో గ్రామాలున్నాయి. దీంతో ప్రమాదాల సమయంలో అగ్నిమాపక యంత్రం అక్కడకు వెళ్లే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. పలు కేంద్రాల్లో నీటి సౌకర్యం కూడా లేదు. దీంతో ప్రమాదం జరిగిందన్న సమాచారం వస్తే నీటి కోసం, డ్రైవర్ కోసం అన్వేషణ చేయాల్సిన పరిస్థితి ఉందంటే ఆశ్చర్యం కాదు. ప్రమాదాలకు, దూరాన్ని బట్టి అగ్నిమాపక కేంద్రాలు లేవు. ఏటా అగ్ని ప్రమాదాల్లో కోట్లాది రూపాయల ఆస్తులు బుగ్గిపాలవుతున్నా సమస్యలతో వెంటాడుతున్న అగ్నిమాపక శాఖ వాటిని కాపాడలేకపోతోంది. అత్యంత కీలకమైన అగ్నిమాపక శాఖను ప్రభుత్వం గాలికి వదిలేసిందని చెప్పవచ్చు. వాహనాల మరమ్మతులకు అగ్ని మాపక శాఖ నుంచి నిధులు విడుదల కావడం లేదు. జిల్లాలో ఏ మూల ఏ ప్రమాదం జరిగినా ఆ ప్రాంతానికి దగ్గరలో ఉన్న ఫైర్ ఇంజన్ వెళ్లడానికే చాలా సమయం పడుతోంది. తగినన్ని ఫైర్ స్టేషన్లు, వాహనాలు లేక, సిబ్బంది లేక ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాల్సిన అగ్నిమాపక శాఖే ప్రమాదంలో ఉంది. అత్యంత ప్రాధాన్యం కలిగిన అగ్ని మాపక శాఖపై పాలకులు అలసత్వాన్ని ప్రదర్శిస్తుండటంపై ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

మూడు జిల్లాలు.. ఆరు మండలాలు

జిల్లా కేంద్రమైన నరసరావుపేట ఫైర్‌స్టేషన్ అభివృద్ధికి నోచుకోవడంలేదు. ఈ స్టేషన్ పరిధిలో మూడు జిల్లాలు ఆరు మండలాలకు నరసరావుపేటలోని అగ్నిమాపక శకటం ఒకటే దిక్కు. పల్నాడు జిల్లా నరసరావుపేట, రొంపిచర్ల, నకరికల్లు, నాదెండ్ల గుంటూరు జిల్లా ఫిరంగిపురం, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలాలు నరసరావుపేట కేంద్రం పరిధిలో ఉన్నా రెండో శకటం మంజూరు కావడంలేదు. ఫైర్‌మన్ల కొరత ఉన్నా ప్రొటోకాల్ విధులకు ఇక్కడ సిబ్బంది హాజరు కావాల్సి ఉంది. డిప్యూటేషన్‌పై పోలీసు శాఖ నుంచి వచ్చిన నలుగురు హోంగార్డులతో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఫైర్‌ఇంజన్‌కు సంబంధించి డెలీవరి హోజ్ పైపుల కొరత ఉంది.

● వినుకొండలోని వెల్లటూరురోడ్డులో అగ్నిమాపక కేంద్రం ఉండగా ఇక్కడ 1999నాటి ఫైర్ ఇంజన్‌తోనే మంటలు ఆర్పాల్సి వస్తోంది. సిబ్బంది కొరతతో పోలీస్ శాఖ నుంచి అదనంగా హోంగార్డులను నియమించారు. బ్రీతింగ్ ఆపరేటింగ్ సిస్టమ్ పరికరాలు లేవు.

● పిడుగురాళ్ల అగ్నిమాపక కేంద్రం పరిధిలో ఆరు మండలాలు ఉండగా 50 కిలోమీటర్లు పైగా దూరం వెళ్లి సేవలు అందించాల్సి వస్తోంది. మూడేళ్ల క్రితం కర్నూలు జిల్లా నుంచి ఫైరింజన్ కేటాయించగా అది తరచూ మరమ్మతులకు గురవుతుంది. సిబ్బంది కొరతతో ఏడుగురు హోంగార్డులను నియమించారు. కొత్త వాహనం కావాలని ప్రతిపాదనలు పంపినా అధికారులు పట్టించుకోలేదు.

● చిలకలూరిపేటలోని అగ్నిమాపక కేంద్రానికి సొంత భవనం లేదు. 50 ఏళ్ల క్రితం దాతల సహకారంతో నిర్మించిన రేకుల షెడ్డులోనే కేంద్రం కొనసాగుతున్నది. సిబ్బందికి సరిపడా వసతులు లేవు. పోలీస్ శాఖ నుంచి వచ్చిన తాత్కాలిక సిబ్బందిని వినియోగించుకుంటున్నారు.

● మాచర్లలోని ఫైర్‌స్టేషన్‌లో కాలం చెల్లిన వాహనం ఉంది. కండీషన్ అంతంతమాత్రంగానే ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో దానిని వినియోగిస్తున్నారు. ఒక డ్రైవర్, ఐదుగురు ఫైర్‌మన్లను నియమించాలి. నీటి లభ్యత కూడా అందుబాటులో లేదు.

● సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్ర పరిధిలో 77 గ్రామాలు ఉన్నాయి. అగ్నిమాపక అధికారి లేరు. డ్రైవర్ పోస్టు ఖాళీ గా ఉంది. కేంద్రానికి ఇన్‌స్టాటబుల్ రెస్క్యూ బోర్డు, బ్రీతింగ్ ఆపరేటర్ సెట్లు, అగ్ని ప్రమాదాన్ని ఆపడానికి అవసరమైన ఓజులు లేవు.



మాచర్లలో ఫైర్ ఇంజను



వినుకొండ ఫైర్ స్టేషన్‌లో కాలం చెల్లిన ఫైర్ ఇంజన్

మీ పంట.. ఈ-పంటలో ఉందా!

అభ్యంతరాలకు అవకాశం



ఈ-పంట నమోదు జాబితాను ప్రతి రైతు పరిశీలించవచ్చు. అందులో నమోదైన వివరాలు సక్రమంగా లేకపోతే అభ్యంతరం తెలపవచ్చు. అభ్యంతరాలు స్వీకరించి జాబితాను సరి చేస్తాం. రైతులు సాగు చేసే పంట వివరాలు ఈ-పంటలో నమోదు చేయించుకోవడం తప్పనిసరి. దానివల్ల విపత్తుల సమయంలో రైతులు పరిహారం అందుకోవచ్చు. - శ్రీనివాసరావు, ఏడీఏ, గుంటూరు

- రైతు సేవా కేంద్రాల్లో నేటి నుంచి సామాజిక తనిఖీ
- ముసాయిదా జాబితా తయారు చేసిన వ్యవసాయశాఖ
- తప్పులపై అభ్యంతరాలు స్వీకారం.. 22న తుది జాబితా విడుదల

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

● గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన రామారావు అనే రైతు పొగాకు సాగు చేశారు. ఈ-పంటలో శనగ అని నమోదైంది.

● పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం తాళ్లచెరువుకు చెందిన హనుమంతరావు ఐదెకరాల్లో మిరప సాగు చేయగా రెండు ఎకరాల్లో మాత్రమే సాగు చేసినట్లు ఈ-పంటలో నమోదు చేశారు.

● బాపట్ల జిల్లా బాపట్ల మండలం కంకటపాలెంలో శ్రీనివాసరావు అనే రైతు పంట సాగు చేస్తే ఆ పొలం వెంకయ్య సాగులో ఉన్నట్లు నమోదైంది.

ఇలాంటి పొరపాట్లు వల్ల రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. విపత్తులు సంభవించినప్పుడు రైతులకు రావాల్సిన నష్ట పరిహారం, పంటల బీమా రాకుండా పోతుంది. ఈ పరిస్థితి నుంచి రైతులను తప్పించేందుకు వ్యవసాయ శాఖ రంగం సిద్ధం చేసింది. రబీలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసింది. ఒక వేళ ఈ-పంటలో తప్పులు నమోదైతే అప్పటికప్పుడు వాటిని సరిదిద్దుకునే అవకాశం రైతులకు కల్పించారు. ఈ మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 858 రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు వివరాలు సోమవారం వెల్లడిస్తారు. ప్రతి రైతు తన పొలంలో సాగు చేసిన పంటను వ్యవసాయ సిబ్బంది సక్రమంగా నమోదు చేశారా.. లేదా అన్న విషయాన్ని పరిశీలించుకోవచ్చు. ఒక వేళ తప్పులు ఉంటే అక్కడికక్కడే అభ్యంతరం పత్రం అందజేయవచ్చు. వ్యవసాయ సిబ్బంది అభ్యంతరాలను సరిచేసి మండల అధికారులతో ఆమోదింపచేస్తారు. తహసీల్దారు, వ్యవసాయ శాఖాధికారి ఆమోదించిన తుది జాబితాను ఈ నెల 22న రైతు సేవా కేంద్రాల్లో వెల్లడిస్తారు.



అంతా తప్పుల తడకలే...


ఈ-పంట నమోదు ప్రక్రియ 2016 నుంచి జరుగుతుంది. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పొలంలోకి వెళ్లి రైతు ఏ పంట వేశారో పరిశీలించి ఈ-పంటలో నమోదు చేయాలి. ఆ తర్వాత గ్రామసభ నిర్వహించి జాబితాలను ప్రదర్శించాలి. అయితే గత జగన్ ప్రభుత్వ హయాంలో గ్రామ సభలు జరగలేదు. వ్యవసాయ సిబ్బంది కార్యాలయంలో కూర్చుని ఏదో ఒక పంటను నమోదు చేశారు. జియో ట్యాగింగ్‌ను కూడా ఫార్స్‌గా మార్చారు. రెవెన్యూ సిబ్బంది అసలు ఈ ప్రక్రియలోనే పాల్గొనలేదు. ఫలితంగా ప్రకృతి విపత్తుల కాలంలో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. జగన్ ప్రభుత్వ నిర్వాకంపై కేంద్ర వ్యవసాయ శాఖకు ఫిర్యాదులు కూడా వెళ్లాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో ప్రస్తుతం వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తమై గతంలోలా తప్పులు దొర్లకుండా వాటిని సరి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసి అమలుకు రంగంలోకి దిగారు. సామాజిక తనిఖీ జరిగితేనే లోటుపాట్లు వెలుగులోకి వస్తాయన్న ఆలోచనతో రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట జాబితాలు ప్రదర్శించే ఏర్పాటు చేశారు.

ఆ రైతులు.. భగీరథులు

- కరువును అధిగమించి వ్యవసాయం
- కుడి కాల్వ నుంచి పొలాలకు కి.మీ మేర పైపులు



పొలాలకు వస్తున్న కృష్ణా జలాలు



బయ్యారం వద్ద కాలువలో ఏర్పాటు చేసిన మోటార్లు

మాచర్ల టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వెయ్యి అడుగులు వేసినా నీటి తడి లేదు.. సమీపంలో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది.. నీరు లేక కళ్లెదుట పంటలు నష్టపోవాల్సి వస్తోంది.. ఎవరో వస్తారు.. ఆదుకుంటారు.. అని చూడకుండా రైతులే భగీరథులయ్యారు. స్తోమతకు మించి అప్పులు లక్షలు చేసి పంటలు కాపాడుకుంటున్నారు. ఒకప్పుడు పంటలు పండక ఊళ్లకు ఊర్లు తాళాలు వేసి ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిపోయే రైతులు ప్రస్తుతం ఎన్ని కష్టాలు ఎదురైనా సాగును వీడటంలేదు. పైగా పొరుగు జిల్లాల్లోని కూలీలకు ఉపాధిని కల్పిస్తున్నారు. కరువు వచ్చినా వలసలు వెళ్లకుండా వ్యవసాయం చేస్తూ పల్నాటి మెట్ట ప్రాంత రైతులు స్వగ్రామాల్లోనే నిలదొక్కుకుంటున్నారు. భగీరథుల్లా మారిన రైతులు కృష్ణా జలాలను పొలాలకు మళ్లించుకుని పంటలు పండించి వలసలకు, కరువుకు స్వస్తి పలుకుతున్నారు. నాగార్జున సాగర్ కుడి కాల్వపై మోటార్లు ఏర్పాటు చేసుకున్న రైతులు పదిహేను కి.మీ మేర పైపులు వేసుకుని మరీ నీటిని పంపింగ్ చేసుకుంటూ పంటలను కాపాడుకుంటున్నారు. వెల్దుర్తి మండలంలో వెయ్యి అడుగులు లోతు బోర్లు వేసినా నీరు లభించక పొలాలను వదులుకుని ఇతర జిల్లాలకు ఉపాధి కోసం వలస వెళ్లిన వారు స్వగ్రామాల్లో సాగులో బిజీబిజీగా మారారు. సాగునీరు అందుబాటులో లేకపోయినా గంగలకుంట, మరసపెంట రైతులు జెర్రివాగు వద్ద కృష్ణానది జలాలను పొలాలకు రప్పించుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదారుగురు రైతులు కలిసి సుమారు రూ.25 లక్షల వరకు ఖర్చు పెట్టుకుని ట్రాన్స్‌ఫార్మర్, సబ్ మెర్సిబుల్ మోటారు, పైపులైన్లు ఏర్పాటు చేసుకుని నీటిని పొలాలకు తరలిస్తున్నారు. హనుమాపురంతండా, గంగలకుంట రైతులు ఎగువన ఉన్న కృష్ణానది పాయ నుంచి నీరు తరలించి పంటలు పండిస్తున్నారు. ఈ గ్రామాల పరిధిలోని సుమారు వందకు పైగా మోటార్లు ఏర్పాటు చేసుకుని వ్యవసాయం చేస్తున్నారు.

- కుడి కాల్వపై బయ్యారం వద్ద 365 రోజులు నీరు అందుబాటులో ఉంటుంది. దీంతో మాచర్ల మండలంలోని కొప్పునూరు, హస్నాబాద్‌తండా, సుబ్బారెడ్డిపాలెం, కొత్తపల్లి, కొత్తూరు, బైరవునిపాడు, అలుగురాజుపల్లి రైతులు పదుల సంఖ్యలో విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకుని సుమారు 15 నుంచి 20 కి.మీ.ల మేర పైపులైన్లు ద్వారా నీటిని తరలించి పంటలను కాపాడుకుంటున్నారు. రబీ, ఖరీఫ్ సీజన్ లోనూ నీరు సమృద్ధిగా ఉండడంతో రైతులకు ఒకింత ఊరట లభించింది. మిర్చి, పత్తి, వేరుశనగ, పుచ్చకాయ, బొప్పాయి వంటి వాణిజ్య పంటలతోపాటు బత్తాయి, నిమ్మ, మామిడి తోటలు సాగు చేస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (సోమవారం)

సహరి : 5.03 (మంగళవారం)

నమ్మితే వెన్నంటి ఉండే ఏసయ్య

- హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, అధ్యక్షుడు అబ్రహం
- ముగిసిన గుడారాల పండుగ

అమరావతి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నమ్మిన విశ్వాసుల జీవితాల్లో స్వస్థత చేకూర్చి కష్టాల నుంచి విముక్తి పరిచేందుకు ఏసయ్య తోడుగా ఉంటారని హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీ తెలిపారు. హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో లేమల్లె గ్రామంలోని దయాక్షేత్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న 48వ గుడారాల పండుగ ఆదివారంతో ముగిసింది. మధ్యాహ్నం జరిగిన చివరి ప్రార్థనలకు విశ్వాసులు, దైవజనులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి జాన్‌వెస్లీ మాట్లాడుతూ స్వస్థత, కల్మషంలేని విశ్వాసులపై ప్రభువు ఆశీర్వచనం ఉంటుందన్నారు. ప్రభువును నమ్మి చేసే ప్రార్థనలు కుటుంబ సమేతంగా ఉండాలన్నారు. హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం మాట్లాడుతూ దయాక్షేత్రంలో దైవజనుల వాఖ్యలు విని నాలుగు రోజుల పాటు దేవుని సేవలో గడిపిన ప్రతిఒక్కరి వెంట ప్రభువు తోడుగా ఉంటారన్నారు. రానున్న రోజుల్లో దయా క్షేత్రం మరింత అభివృద్ధి చెంది ప్రపంచస్థాయి గుర్తింపు పొందుతుం దన్నారు. విశ్వాసులందరి సహకారంతో రానున్న గుడారాల పండుగకు మరి న్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. హోసన్న బ్రదర్స్, సిస్టర్స్, పాస్టర్ రమేష్ ఆలపించిన స్తుతి గీతాలతో విశ్వాసులు తన్మయత్వం చెందారు. నైజీరియా, సౌత్రాఫికా తదితర దేశాలతో పాటు, దక్షిణాది రాష్ట్రాల నుంచి దైవజనులు, తెలుగు రాష్ట్రాల నుంచి విశ్వాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.





చివరి రోజు ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు

దిక్సూచి DIKSUCHI

విదేశీ భాషా కోర్సులు ఇక్కడ చదవొచ్చు



భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణకు సంబంధించిన సాధనం మాత్రమే కాదు. ఆధునిక కాలంలో అది కెరీర్ కూడా. మాతృభాషతోపాటు విదేశీ భాషలు నేర్చుకుని అద్భుతమైన కెరీర్ సొంతం చేసుకోవచ్చు. ఎన్ని ఎక్కువ భాషలు వస్తే అన్ని అవకాశాలు పెరుగుతాయి కూడా. భారతదేశంలో విదేశీ భాషలను ప్రైవేటు సంస్థలతోపాటు పలు ప్రభుత్వ విద్యా సంస్థలు కూడా అందిస్తున్నాయి. ఇందులో బిగినర్ కోర్సులు, ఇంటర్మీడియెట్ కోర్సులు, అడ్వాన్స్‌డ్ కోర్సులు, స్పెషలైజ్డ్ కోర్సులు ఉంటాయి. బిగినర్ కోర్సులు కొంత ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందిస్తే ఇంటర్మీడియెట్ కోర్సులు భాషా పరిజ్ఞానాన్ని పెంచుతాయి. అడ్వాన్స్‌డ్, స్పెషలైజ్డ్ కోర్సులు అయితే కెరీర్‌కు కావాల్సిన భాషా సంపదను కలిగిస్తాయి. మన దేశంలో భాషకు సంబంధించి కోర్సులు అందించే ప్రభుత్వ వర్సిటీల్లో కొన్ని....

ఢిల్లీ యూనివర్సిటీ: ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్, పర్షియన్, మోడరల్ అరబిక్, పాలీ, టిబెటన్ భాషా - సాహిత్యంలో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తోంది. ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులు. https://www.du.ac.in/

బనారస్ హిందూ యూనివర్సిటీ: పలు విదేశీ భాషలకు సంబంధించిన డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను బనారస్ హిందూ యూనివర్సిటీ అందిస్తోంది. ఫ్రెంచ్, స్పానిష్, రష్యన్, చైనీస్ భాషలు ఇందులో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. https://www.bhu.ac.in/

గురునానక్‌దేవ్ యూనివర్సిటీ, అమృత్‌సర్: ఈ వర్సిటీలో ఫ్రెంచ్‌లో ఫుల్‌టైమ్ డిప్లొమాలు, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, రష్యన్ భాషల్లో పార్ట్‌టైమ్ డిప్లొమాలు ఉన్నాయి. అంతేకాకుండా ఫ్రెంచ్‌లో పార్ట్‌టైమ్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా కూడా అందుబాటులో ఉంది. వీటికి దరఖాస్తు చేయడానికి ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు. https://www.gndu.ac.in/

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీ: భాషలకు సంబంధించిన పలు కోర్సులను ఈ యూనివర్సిటీ అందిస్తుంది. జర్మన్, రష్యన్, స్పానిష్, జపనీస్, కొరియన్, చైనీస్ తదితర భాషలకు సంబంధించిన యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు ఇక్కడ ఉన్నాయి. www.jnu.ac.in/main/

సీఫెల్, హైదరాబాద్: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలో ఉన్న 'సీఫెల్' పలు యూరోపియన్ భాషలకు సంబంధించిన కోర్సులను అందిస్తుంది. ఇందులో ఫ్రెంచ్, ఫ్రాన్సోఫోన్ స్టడీస్, జర్మనిక్ స్టడీస్, హిస్పానిక్ స్టడీస్, లాటిన్, రష్యన్‌కు స్టడీస్ తదితరాలపై పలు కోర్సులు ఉన్నాయి. https://www.efluniversity.ac.in

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో డిప్లొమా అడ్మిషన్లు

హైదరాబాద్ బాలానగర్‌లో ఉన్న 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్'(సీఐటీడీ)లో 2025-26 సంవత్సరానికి కింది డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నారు. 1968లో ఏర్పాటైన కేంద్రప్రభుత్వ సంస్థ ఇది. ఇందులో సర్టిఫికెట్, డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఎంఈ, ఎంటెక్ కోర్సులు ఉన్నాయి. ప్రస్తుతం డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్ వెలువడింది.

కోర్సులు	సీట్లు
● డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్(డీటీడీఎం)	60
● డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(డీఈసీఈ)	60
● డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్(డీఏఆర్ఈ)	60
● డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్(డీపీఈ)	60

(డీటీడీఎం కోర్సు నాలుగు సంవత్సరాలు - మిగిలిన కోర్సు మూడు సంవత్సరాలు)

విద్యార్హతలు: డీటీడీఎం కోర్సు చేయాలంటే కనీసం 50 శాతం మార్కులతో పది పాసై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు.

వయోపరిమితి: 2025 మే 22 తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 19 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలో చేయవచ్చు.

పరీక్ష విధానం: పదో తరగతి స్థాయిలో మేథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతోపాటు, ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్‌లపై ప్రశ్నలు ఉంటాయి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 మే 22. **ప్రవేశ పరీక్ష:** 2025 మే 25

Contact Details: Admission Desk at Diploma Block
Ph: 9502405170, 040-29561795 **E-Mail:** training@citdindia.org,
Website: https://www.citdindia.org

ఐఐఐటీ శ్రీసిటీలో ఎంటెక్

వీఎల్ఎస్ఐ, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్

గ్లోబల్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ 2026 నాటికి 64 బిలియన్ డాలర్లు చేరుకుని, 2030 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు దాటుతుందని మెకిన్సే కంపెనీ అంచనా వేసింది. అందువల్ల వీఎల్ఎస్ఐ, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ విపరీతంగా ఉంటుందని చెబుతోంది. అలాగే 2025 సంవత్సరం చివరి నాటికి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ) మార్కెట్ రెండు బిలియన్ డాలర్లు ఉండవచ్చని నాస్కామ్ చెబుతోంది. అటానమస్ వెహికిల్స్, డ్రోన్లు తదితరాల కారణంగా ఎంబెడెడ్ సిస్టమ్స్, అటానమస్ టెక్నాలజీ అవసరాలు పెరుగుతున్నాయి. ఇక సైబర్ సెక్యూరిటీ గురించి చెప్పాల్సిన పని లేదు.



2025 చివరి నాటికే ట్రిలియన్ల డాలర్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో తమ కంపెనీ సైబర్ సెక్యూరిటీ బడ్జెట్‌ను అన్ని కంపెనీలు రెండింతలు చేయనున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ చిత్తూరులోని శ్రీసిటీలో ఉన్న 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ) ఎడ్ కంపెనీ టీమ్ లీజ్‌తో కలిసి అడ్వాన్స్‌డ్ ఆన్‌లైన్ ఎగ్జిక్యూటివ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించింది. వీఎల్ఎస్ఐ, ఐవోటీ అండ్ అటానమస్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీల్లో ఈ ఎంటెక్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

ఎంటెక్ - వీఎల్ఎస్ఐ: సెమీ కండక్టర్ టెక్నాలజీస్, డిజిటల్, అనలాగ్ సర్క్యూట్ డిజైన్, సిస్టమ్ ఆన్ చిప్ డెవలప్‌మెంట్‌పై కోర్సు ఉంటుంది. దీనితోపాటులో పవర్ వీఎల్ఎస్ఐ, నానో స్కేల్ డివైజెస్, మిక్స్‌డ్ సర్క్యూట్ డిజైన్‌లపై ఫోకస్ ఉంటుంది. సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్, చిప్ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ రోల్స్ కోసం పనిచేసేలా విద్యార్థులను తయారు చేస్తారు.

ఎంటెక్ - ఐవోటీ అండ్ అటానమస్ సిస్టమ్స్: ఐవోటీ ఆర్కిటెక్చర్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, అటానమస్ డెసిషన్ మేకింగ్, అడ్వాన్స్‌డ్ వైర్‌లెస్ కమ్యూనికేషన్స్, 5జీ/6జీ టెక్నాలజీస్, డిజిటల్ ట్విన్ అప్లికేషన్స్ తదితరాల్లో ప్రావీణ్యం ఉండేలా రూపొందిస్తున్నారు.

ఎంటెక్-సైబర్ సెక్యూరిటీ: క్రిప్టోగ్రఫి, ఎథికల్ హాకింగ్, క్లౌడ్ సెక్యూరిటీ, ఏఐ ఆధారిత థ్రెట్ డెసిషన్ తదితరాల్లో నాలెడ్జ్ ఉండేలా రూపొందించారు. బ్లాక్‌చైన్ అప్లికేషన్స్, డిజిటల్ ఫోరెన్సిక్స్ లాంటి వాటిలో హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ వచ్చేలా చేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు తదితరాల సైబర్ సెక్యూరిటీ ప్రాబ్లమ్స్ పరిష్కరించేలా ఉంటారు. 2025 జూలై నుంచి ఈ కోర్సులు ప్రారంభం అవుతాయి. సంవత్సరంలో ఒక వారం క్యాంపస్‌కి రావాల్సి ఉంటుంది. మిగిలిన క్లాసులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో బీటెక్/బీఈ/ ఎమ్మెస్సీ/ ఎంసీఏ డిగ్రీని పూర్తిచేయాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు 50 శాతం చాలు. అభ్యర్థులకు 'గేట్' స్కోరు తప్పనిసరి కాదు.

ఫీజు: సెమిస్టరుకు రూ. 65000/- చొప్పున నాలుగు సెమిస్టర్లకి కలిపి రూ. 2,60,000/- అవుతుంది.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్, ఫోన్‌లను సంప్రదించవచ్చు.
040-49170726, admission@iiitsricityonline.com
https://cep.digivarsity.com/iiit-sricity/

SCHOLARSHIP ALERT

Narotam Sekhsaria Scholarships for Higher Studies

Description: Narotam Sekhsaria Scholarships for Higher Studies 2025-26 is a merit-based scholarship initiative of the Narotam Sekhsaria Foundation that aims to provide financial assistance to outstanding Indian students aspiring to pursue higher education at prestigious institutions in India and abroad.
Eligibility: Applicants must be an Indian national residing in India and a graduate from an accredited Indian university. They should be under 30 years old as of 31st January 2025. They must plan to pursue a postgraduate degree in top-ranking institutions in India or abroad, starting in the Fall 2025.
Prizes & Rewards: The scholarship offers interest-free loans as financial assistance including mentorship support.
Last Date: 17-03-2025 ***Application:*** Online only
Short Url: www.b4s.in/aj/NSSP1

India High Fliers Undergraduate



Description: India High Fliers Undergraduate Scholarships 2025 is provided by the University of Birmingham to students pursuing selected full-time undergraduate programs at the university. A total of 20 scholarships will be available for the academic year 2025-26.
Eligibility: Applicants must be a domiciled resident of India holding an offer for a full-time undergraduate program. They must be classified as overseas fee-payer student.
Prizes & Rewards: The scholarship offers an amount of GBP 5,000 for the first year of undergraduate studies.
Last Date to Apply: 31-05-2025
Application mode: Offline applications via local representatives and partnered schools
Short Url: www.b4s.in/aj/IHFS1

Vahani Scholarship

Description: The Vahani Scholarship for 2025-26 is offered by the Vahani Group to Class 12 students. This scholarship aims to support students from economically disadvantaged backgrounds in India to pursue their higher education.
Eligibility: Open to Indian citizens currently studying in Class 12 and appearing for the final board examination next year. Applicants must have secured at least 85% marks in Class 10. The applicant's annual family income must be less than 300,000 from all sources.
Prizes & Rewards: Full tuition fees, stipend, and other benefits. ***Last Date:*** 01-12-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/VAHS1

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

షూటింగ్ పూర్తి



కంగనా రనౌత్, మాధవన్ జంటగా మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. వారిద్దరూ ప్రధాన పాత్రధారులుగా ఏఎల్ విజయ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని కంగన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. చిత్రబృందంతో సెట్‌లో దిగిన ఫొటోలను షేర్ చేశారు. త్వరలోనే టైటిల్‌ను ప్రకటించి, సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపారు. సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం తెరకెక్కింది. 'తను వెడ్స్ మను రిటర్న్స్' చిత్రం తర్వాత కంగన, మాధవన్ కలసి నటించిన చిత్రమిది. అలాగే 'తలైవి' చిత్రం తర్వాత మరోసారి ఏఎల్ విజయ్ దర్శకత్వంలో కంగన నటించారు. తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

కొత్త ప్రయాణం మొదలు



నటి అభినయ వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. చిన్ననాటి స్నేహితుణ్ణి ప్రేమించానని, త్వరలో అతన్ని పెళ్లి చేసుకుంటానని గతంలో ఆమె తెలిపారు. ఇటీవలే నిశ్చితార్థం జరిగినట్లు ఆదివారం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభినయ తెలిపారు. కాబోయే భర్తతో కలసి ఆలయంలో గంట కొడుతున్న ఫొటోను షేర్ చేసి, 'కొత్త ప్రయాణం మొదలైంది' అని చెప్పారు. అయితే కాబోయే భర్త వివరాలు, పెళ్లి ఎప్పుడు జరగబోతోంది అనే విషయాలను ఆమె తెలపలేదు. పలు దక్షిణాది సినిమాల్లో నటించిన అభినయ 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, శంభో శివ శంభో తదితర చిత్రాలతో తెలుగునాట గుర్తింపు తెచ్చుకున్నారు.

భయానక అనుభవాల కథ



యదార్థ సంఘటనల ఆధారంగా సైకలాజికల్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రం 'శారీ'. ఆర్జీవీ - ఆర్వి ప్రొడక్షన్స్ బేనర్‌పై గిరి కృష్ణ కమల్ దర్శకత్వంలో రవిశంకర్ వర్మ నిర్మించారు. సత్య యాదు, ఆరాధ్యదేవి జంటగా నటించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. పలు భారతీయ భాషల్లో ఈ నెల 21న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత ఎదుర్కొన్న భయానక అనుభవాల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అన్నారు. ఓ మంచి సినిమాతో నిర్మాతగా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉందని రవిశంకర్ చెప్పారు.



శ్రీలీలకు చిరంజీవి కానుక

నటి శ్రీలీలకు చిరంజీవి ఓ విలువైన కానుకను బహూకరించారు. చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా సెట్స్‌లో శ్రీలీల సందడి చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా దుర్గాదేవి ప్రతిమ ఉన్న ఓ వెండి శంఖాన్ని ఆమెకు కానుకగా ఇచ్చారు చిరంజీవి. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి, అభిమానులతో తన ఆనందాన్ని పంచుకున్నారు శ్రీలీల. భారీ బడ్జెట్‌తో వంశీ, విక్రమ్, ప్రమోద్ 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శ్రీలీల కూడా ఓ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు.

చరిత్రలో నిలిచిపోయే చిత్రం...



'మల్లేశం', '8 ఏఎమ్ మెట్రో' చిత్రాల దర్శకుడు రాజ్ రాచకొండ. ఆయన దర్శకత్వంలో కొత్త చిత్రం రాబోతోంది. నటుడు రానా దగ్గుబాటి సొంత నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా, స్టూడియో 9తో కలసి నిర్మిస్తోంది. తేజ, తన్మయి, ఝాన్సీ, తాగుబోతు రమేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 1990ల్లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్న ఈ సినిమాకు '23' అనే టైటిల్‌ను ఖరారు చేసి టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ రాచకొండ మాట్లాడుతూ "ఈ సినిమా మానవ హక్కుల గొప్పతనాన్ని ఆవిష్కరిస్తుంది. అన్యాయానికి గురైన వారికి అండగా ఉంటుంది. తప్పు చేయడం తప్పని చెప్పడంతో పాటు హింసకు వ్యతిరేకంగా ఉంటుంది" అని అన్నారు. "ఈ సినిమాను ప్రేక్షకులు వెతుక్కుంటూ వచ్చి చూస్తారు. చరిత్రలో నిలబడిపోతుంది" అని నటి ఝాన్సీ చెప్పారు.

స్పెషల్ సాంగ్‌తో సిద్ధమా?

సినిమాల్లో కథానాయిక పాత్రల్లో అలరించడమే కాదు, అప్పుడప్పుడూ రూటు మార్చి ప్రత్యేక గీతాల్లోనూ మెరుస్తుంటారు తారామణులు. జనాల్లో క్రేజ్ పెంచడమే కాకుండా సినిమా విజయానికీ దోహదపడుతుంటారు. తాజాగా అగ్రహీరోలతో ప్రత్యేక గీతాలు చేస్తున్నారంటూ కొంతమంది హీరోయిన్ల పేర్లు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. వారెవరో తెలుసుకుందాం.



ప్రభాస్ కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'రాజాసాబ్'. ఈ హారర్ థ్రిల్లర్‌లో మాంచి జోష్‌తో నిండిన ప్రత్యేక గీతం ఉందట. ఈ పాటలో స్టెప్పులేసేందుకు ఓ స్టార్ హీరోయిన్ అయితే బావుంటుందని భావించిన చిత్రబృందం నయనతారని సంప్రదించారని టాక్. ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. గతంలో ప్రభాస్‌కు జంటగా 'యోగి' సినిమాలో హీరోయిన్‌గా నటించారు నయనతార. ఇక 'యానిమల్' సినిమాలో అందాల ఆరబోతతో అలరించిన త్రిప్తి దిమ్రీని సైతం మేకర్స్ సంప్రదించినట్లు ప్రచారం జరిగింది. అయితే, వీరిలో ఎవరు ఫైనల్‌గా పాటలో కనపడతారనేది తెలియాల్సి ఉంది.

ఎన్టీఆర్.. హృతిక్‌తో

2022లో వరుణ్‌ధావన్ హీరోగా నటించిన 'భేడియా' చిత్రంలో 'తుమ్‌కేశ్వరీ' అనే ప్రత్యేక గీతంలో మెరిశారు శ్రద్ధా. 'పుష్ప 2'లో 'కిస్సిక్' సాంగ్ కోసం మొదట శ్రద్ధాని సంప్రదించినా పారితోషికం తక్కువని ఆమె అంగీకరించలేదు. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న చిత్రం 'వార్ 2'లో ఆమె స్పెషల్ సాంగ్ చేయబోతున్నారట. 2019లో విడుదలై సూపర్ హిట్ సాధించిన 'వార్'కు ఇది కొనసాగింపు. ఈ సినిమాపై తారస్థాయిలో ఉన్న అంచనాలను మరింత పెంచేలా ప్లాన్ చేస్తున్నారు నిర్మాతలు. అందుకోసం ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నారు. 'స్త్రీ 2'తో ఇండస్ట్రీ హిట్ కొట్టిన శ్రద్ధా కపూర్‌ను ఈ పాట కోసం సంప్రదించారని టాక్. మంచి డ్యాన్సరైన శ్రద్ధా తన స్టెప్పులతో.. ఎన్టీఆర్, హృతిక్ ఎనర్జీని పర్ఫెక్ట్‌గా మ్యాచ్ చేస్తారని మేకర్స్ అభిప్రాయపడుతున్నారట.

ఒకేసారి రెండు చిత్రాల్లో..

గేమ్ ఛేంజర్ చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించారు కియారా అడ్వాణీ. యశ్ కథానాయకుడిగా 'ముఫ్తీ' ఫేమ్ గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టాక్సిక్'. ఇందులో కియారా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే, ఈ సినిమాలో ఓ ప్రత్యేక గీతంలో కూడా ఆమె కనిపించనున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా వచ్చిన 'సలార్' చిత్రానికి సీక్వెల్‌లో కీలక పాత్రతో పాటు ప్రత్యేక గీతంలో కియారా తళుక్కున మెరవనున్నారనే టాక్ నడుస్తోంది. 2022లో విక్కీ కౌశల్ హీరోగా నటించిన 'గోవింద్ మేరా నామ్' చిత్రంలో 'బిజిలీ' అనే ప్రత్యేక గీతంలో నటించారు కియార.

సీక్వెల్‌లోనూ ఛాన్స్

రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జైలర్' సినిమా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో తమన్నా భాటియా చేసిన 'నువ్వే కావాలయ్యా' ప్రత్యేక గీతం పెద్ద హిట్ అయింది. దీంతో ఈ సినిమా సీక్వెల్‌లో తమన్న పాత్ర నిడివిని పెంచడంతో పాటు ఆమెతో ప్రత్యేక గీతం ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. ఇటీవలే తమన్న 'స్త్రీ'లో ఓ స్పెషల్ సాంగ్ చేయడం.. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో.. ఆ సెంటిమెంట్ కలిసొస్తుందనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారట మేకర్స్.

ఓజీ కోసం రాధిక

'డీజే టిల్లు' చిత్రంతో యువతరాన్ని ఆకట్టుకున్న కథానాయిక నేహా శెట్టి. ఆ చిత్రంతో ఆమె క్రేజ్ ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం ఈ భామకు ఓ సూపర్ ఆఫర్ వచ్చింది. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓజీ'. ఈ సినిమా సెకండ్ హాఫ్‌లో వచ్చే ప్రత్యేక గీతం కోసం నేహా శెట్టిని ఎంపిక చేశారు. అయితే, ఇందులో ఆమె కేవలం ఓ పాటకే పరిమితమవుతారా లేదా కీలక పాత్రలో నటిస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది.

మరోసారి ప్రత్యేక గీతంలో

సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'రెట్రో'. మే 1న విడుదలవనున్న ఈ సినిమాలో శ్రియ ఓ ప్రత్యేక గీతంలో స్టెప్పులేశారని తెలుస్తోంది. కాగా, ఇప్పటికే పవన్‌కల్యాణ్ నటించిన 'పులి'.. వెంకటేశ్ నటించిన 'తులసి'.. తరుణ్ నటించిన 'సోగ్గాడు'.. ప్రభాస్ నటించిన 'మున్నా' వంటి పలు చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌లో తళుక్కుమన్నారు శ్రియ.

మేరిమాత అనుగ్రహం ఎల్లవేళలా ఉంటుంది



పీఠాధిపతి డాక్టర్ భాగ్యయ్యకు ఘన సత్కారం

మాచర్ల రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మేరిమాత అనుగ్రహం భక్తులకు ఎల్లవేళలా ఉంటుందని గుంటూరు పీఠాధిపతి (బిషప్) డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండలంలోని విజయపురిసౌత్‌లో సాగరమాత ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన నిర్వహించిన సమష్టి దివ్యపూజాబలిలో భక్తులకు దైవ సందేశం అందించారు. ఆధ్యాత్మిక ఆయుధాలైన ప్రార్థన, ప్రేమ, నీతి, కరుణ, దయ, క్షమా గుణం కలిగిన వ్యక్తులు దేవుని మార్గంలో నడుస్తారని వివరించారు. శత్రువును సైతం ప్రేమించాలని, తద్వారా మోక్షం లభిస్తుందన్నారు. విజయపురిసౌత్‌కు చేరుకున్న పీఠాధిపతి భాగ్యయ్యను ప్రత్యేక వాహనంలో ఆలయం వద్దకు బాణసంచా, బ్యాండు మేళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఘనంగా సత్కరించారు. వేడుకలలో జిల్లా క్రైస్తవ గురువులు, కన్యస్త్రీలు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఏకోటూరిజంలో సేంద్రియ ఉత్పత్తులతో రెస్టారెంట్



రెస్టారెంట్ లోపల ప్రాంతం

బాపట్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకోటూరిజం (ప్రకృతి క్షేత్రం) పర్యాటకులను కనువిందు చేస్తుంది. ఆహ్లాదాన్ని పంచే చల్లటి వాతావరణంలో ఏర్పాటైన ఈ టూరిజం స్పాట్‌లో సేంద్రియ వ్యవసాయోత్పత్తులతో తయారు చేసే వంటకాలను పర్యాటకులకు అందుబాటులోకి తెస్తున్నారు. ఇక్కడ ఉన్న రెస్టారెంట్‌లో ఈ ఉత్పత్తులను సోమవారం నుంచి పర్యాటకులకు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా అనేక ఔషధ గుణాలు కలిగిన మొక్కలు ఏర్పాటు చేసిన అటవీ అభివృద్ధి సంస్థ ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు ఆత్మీయ విందును ఏర్పాటు చేసేలా సేంద్రియ వ్యవసాయోత్పత్తులతో రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ వసతి గృహాలను వినియోగించుకునే పర్యాటకుల కోసం దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు డివిజనల్ మేనేజర్ ఎ.గీతిక తెలిపారు. నీడనిచ్చేచెట్ల కింద పర్యాటకులు సేదతీరేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇక్కడ నుంచి సముద్ర తీరానికి పర్యాటకులను తీసుకెళ్లేందుకు వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రెస్టారెంట్‌లోపూర్తి స్థాయి సేంద్రియ వంటకాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు.

ముగిసిన టెన్నిస్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఆర్ క్లబ్ కోశాధికారి మక్కెన నరసింహారావు

చిలకలూరిపేట, మార్చి9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌లో మూడు రోజులపాటు జరిగిన ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల స్థాయి టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలలో రెండు జిల్లాల నుంచి మొత్తం 51 టీంలు పాల్గొన్నాయి. మెన్ డబుల్స్ విభాగంలో 35, 45, 55, 65 ప్లస్ ల వారికి ఈ పోటీలు నిర్వహించారు. బహుమతులను చిలకలూరిపేట కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు సమకూర్చారు. విజేతలకు సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, కోశాధికారి మక్కెన నరసింహారావు బహుమతులు అందజేశారు. 35 ప్లస్ విభాగంలో విన్నర్స్‌గా చిలకలూరిపేట, రన్నర్స్‌గా నరసరావుపేట జట్లు గెలుపొందాయి. 45 ప్లస్ విభాగంలో విన్నర్స్‌గా తెనాలి, రన్నర్స్‌గా గుంటూరు జట్లు, 55 ప్లస్ విభాగంలో విన్నర్స్‌గా గుంటూరు, రన్నర్స్‌గా చిలకలూరిపేట జట్లు, 65 ప్లస్ విభాగంలో విన్నర్స్‌గా కనిగిరి, రన్నర్స్‌గా చిలకలూరిపేట జట్లు విజయం సాధించాయి.

దిగుబడి పెరిగింది.. ధర తగ్గింది

- హెచ్చుతగ్గులతో పచ్చిమిర్చి రైతులకు కష్టాలు

బాపట్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పచ్చిమిర్చి సాగుకు ప్రసిద్ధి గాంచిన బాపట్ల నియోజకవర్గంలో ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా కనిపించటంలేదు. వాతావరణం సాగుకు అనుకూలించటంతో ఉత్పత్తులు బాగా పెరిగాయి. అయితే ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవటంతో రైతులు నష్టాలు చవి చూడాల్సి వస్తుంది. అత్యధికంగా కర్లపాలెం మండలంలోని పాతనందాయపాలెం, కొత్తనందాయపాలెం, ఎంవీరాజుపాలెం, ఏట్రవారిపాలెం, నల్లమోతువారిపాలెం, యాజలి, దుండివారిపాలెం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాలలో పచ్చిమిర్చిసాగు చేస్తుంటారు. బాపట్ల మండలంలోని నందిరాజుతోట, కొండుభొట్లపాలెం, పిన్నిబోయనవారిపాలెం, పడమరబాపట్ల, వెదుళ్ళపల్లి, బేతపూడి, స్టూవర్టుపురం తదితర ప్రాంతాలలో పచ్చిమిర్చిసాగు చేస్తున్నారు. చెరుకుపల్లి మండలంలోని రాంభొట్లపాలెం పరిసర ప్రాంతాలో పచ్చిమిర్చిసాగు ఉంది. చీరాల మండలంలో ఈ ఏడాది తోటవారిపాలెం గ్రామంలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 1145, 5005, జెర్సీ-56, 684 వంటి రకాలు ఎక్కువగా విత్తారు. వీటి ధర ప్రస్తుతం కేవలం కిలో 8 రూపాయలు మాత్రమే ఉంది. ఒక్క ఈషా రకం మాత్రమే కిలో 22 రూపాయలు పలుకుతుంది. ఈ వైరటీ కేవలం కొద్దిమంది రైతులు మాత్రమే సాగు చేస్తున్నారు. సుమారు 1500 ఎకరాలలో రైతులు మోటర్ల సాయంతో గరువు మెరక భూములలో పచ్చిమిర్చి సాగు అనాదిగా చేస్తున్నారు. ఎకరానికి రూ. 50 వేల నుంచి రూ. 70 వేల వరకు కౌలు చెల్లించి మరి సాగు చేస్తున్నారు. ఈషారకం రెండు కోతలు మాత్రమే వస్తుంది. మిగిలిన రకాలు నాలుగు కోతలు వస్తాయి. అయినప్పటికీ ధర లేకపోతే పెట్టుబడితోపాటు కూలీల ఖర్చు పెరిగిపోయి నష్టాలు చవి చూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పచ్చిమిర్చి హబ్‌గా ఉన్న ఈ ప్రాంతంలో పచ్చిమిర్చి మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. అయితే అది ఆచరణకు నోచుకోకపోవటం వల్ల దళారులకు విక్రయించి రైతులు నష్టపోతున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



బాపట్ల నియోజకవర్గంలో పచ్చిమిర్చి తోటలు

ఆశించిన మేర ధరలేదు



పచ్చిమిర్చికి ఆశించిన మేరకు ధర లభించటంలేదు. మొదట్లో కిలో 14 రూపాయలు అమ్మినప్పటికీ ప్రస్తుతం 8 రూపాయలకు తగ్గిపోవటం వలన తోటలో కాయలు కోయకుండా ఉంచాం. ఎకరానికి ఒక కోతకు 100 బస్తాలు వరకు దిగుబడి వస్తుంది. మొదటికోత తక్కువగా వచ్చినప్పటికీ, రెండు కోతలు దిగుబడులు ఎక్కువగా వచ్చి నాలుగో కోత తగ్గుతుంది. ఏదో ఒక కోతకు మంచి ధర లభిస్తే నష్టపోకుండా ఖర్చులు వస్తాయి. లేకుంటే నష్టం వాటిల్లుతుంది. ధరలు ఆశాజనకంగా ఉంటే లాభాలు వచ్చే అవకాశం ఉంది.

- ఎస్.శ్రీనివాసరెడ్డి, పడమర బాపట్ల రైతు

యాలి వాహన రూఢుడైన లక్ష్మీనృసింహుడు

- ముత్యాల పల్లకీపై గ్రామోత్సవం



ముత్యాల పల్లకీ సేవలో లక్ష్మీనృసింహుడు

మంగళగిరి సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారు ఆదివారం రెండు వాహనాలపై ఊరేగారు. సాధారణంగా నృసింహుని వాహన సేవలు సాయంకాల వేళల్లో జరుగుతాయి. కైంకర్యం ఇచ్చేందుకు దాతలు ముందుకు రావడంతో గత కొద్ది సంవత్సరాల నుంచి ఉదయం వేళల్లో కూడా వాహన సేవలు నిర్వహిస్తున్నారు. చిన్న శేష వాహనం, హంస వాహనం, అశ్వ వాహనం, కల్ప వృక్ష వాహన సేవలు ఉదయం పూట జరుగుతున్నాయి. గతేడాది నుంచి ముత్యాల పందిరి వాహన సేవను కూడా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం ముత్యాల పందిరి వాహనంపై శ్రీవారు పురవీధుల్లో విహరించారు. ఈ ఉత్సవానికి విజయవాడకు చెందిన అంగా ఉపేంద్ర వర్మ, తేజస్విని దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఉత్సవ విశిష్టతను వివరిస్తూ ముత్యం వలె ఎటువంటి మచ్చలేని శ్వేత వర్ణము కలిగిన ముత్యాల పందిరిలో స్వామివారిని దర్శించుకున్న వారికి రుగ్మతలు, దోషాలు, క్రూరత్వం తొలగిపోయి నృసింహుని కరుణా కటాక్షాలు పొందుతారని తెలిపారు. రాత్రి ఉభయ దేవేరులతో కలిసి యాలి వాహన రూఢుడైన శ్రీవారు తొలుత ఆలయ మాడవీధుల్లో విహరించారు. అనంతరం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు గ్రామోత్సవం జరిగింది. ఈ ఉత్సవానికి మంగళగిరికి చెందిన మురికిపూడి పుష్పవేణి, కుమారులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. అర్చకులు ఉత్సవ విశిష్టతను వివరిస్తూ హింసించే స్వభావం కలిగిన క్రూరులను శిక్షించి, సాధువులను రక్షించగలనని తెలియజేయడానికే యాలి వాహనోత్సవం జరుగుతుందన్నారు. యాలి వాహన రూఢుడైన స్వామివారిని దర్శిస్తే దుర్మార్గుల వలన భయం నశిస్తుందన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల వేషధారణలు, మహిళా భక్త బృందం కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



యాలి వాహనంపై గ్రామోత్సవంలో నృసింహస్వామి

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- మంగళగిరిలో ఘనంగా మహిళా సదస్సు
- బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షురాలిగా జయశ్రీ
- మహిళా విభాగం అధ్యక్షురాలిగా సరళాదేవి




మహిళా సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి సవిత

మంగళగిరి సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధితోనే సమాజ ప్రగతి సాధ్యమని భావించిన కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ మహిళలను ప్రోత్సహిస్తుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలోని ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో మహిళా సదస్సు నిర్వహించారు. మంత్రి సవిత మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ఆనాడు ఎన్టీఆర్‌తోపాటు నేడు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దివంగత ఎన్టీఆర్ రాష్ట్రంలో తొలి మహిళా యూనివర్సిటీని నెలకొల్పారని, మహిళలకు పురుషులతో సమానంగా ఆస్తిలో సగభాగం హక్కును కల్పించారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు సైతం మహిళలకు వెన్నుదన్నుగా నిలుస్తూ విద్య, ఉద్యోగ అవకాశాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించారని, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ప్రస్తుత కేబినెట్‌లో ముగ్గురు మహిళలకు కీలక శాఖలను అప్పగించడం గొప్ప విషయమన్నారు. త్వరలో నిర్వహించబోయే మెగా డీఎస్సీలో మహిళలకు టీచర్ పోస్టులు లభించేలా ఉచిత ఆన్‌లైన్ డీఎస్సీ కోచింగ్‌ను కూడా ప్రారంభించనున్నారని వెల్లడించారు. అలాగే మహిళల రక్షణకు శక్తి యాప్‌ను రూపొందిస్తున్నారని తెలిపారు. అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటుతున్న ఘట్టమనేని సాయిరేవతి, చంద్రిక, సాదియా అల్‌మాస్‌లను మంత్రి సవిత ఘనంగా సన్మానించారు. ముగ్గురు గర్భిణీలకు సీమంతం నిర్వహించి, నూతన వస్త్రాలు, పండ్లు అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలిగా జయశ్రీ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా వావిలాల సరళాదేవి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గురుకులాల కార్యదర్శి మాధవీలత, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, సభ్యులు కుమ్మరి క్రాంతికుమార్, తిరువీధుల కిరణ్, పారేపల్లి మహేష్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకే..

- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్



సంఘీభావం తెలియజేస్తున్న చిలుకా చంద్రశేఖర్, నవజ్యోతి

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో ఆదివాసీల కాళ్ల కిందనున్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టేందుకే ఆదివాసీలను అడవుల నుంచి ఖాళీ చేయించే కుట్రలు కేంద్ర ప్రభుత్వం చేస్తుందని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్ ఆరోపించారు. ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక సన్నాహక సమావేశం అరండల్‌పేట ఒకటో లైనులోని ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దండ కారణ్యం ప్రకృతి ఒడిలోనున్న ఖనిజ సంపదలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని ఒప్పందాలు చేసుకుందనీ, అందులో భాగంగానే అడవిలో ఉండే ఆదివాసులను ఖాళీ చేయించాలని చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అడవిలో సైనిక క్యాంపులు పెట్టి ఆదివాసులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపుతున్నారని ఆరోపించారు. ఆదివాసీలు చేస్తున్న ఉద్యమాలకు సంఘీభావంగా ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్ కోలా నవజ్యోతి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలతో మమేకమై అడవులు, కొండలు, గుట్టలను ధ్వంసం చేస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తుందని దుయ్యబట్టారు. అడ్డుకుంటున్న ఆదివాసీలను, విప్లవకారులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపుతూ పచ్చని అడవిలో నెత్తుటి ఏరులు పారిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని, అడవులను, ఆదివాసీలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా మూలవాసి ఆందోళన మంచ్‌పై నిషేధం ఎత్తి వేయాలని, మూలవాసి ఆందోళన మంచ్ పేరుతో అరెస్టు చేసిన రఘు తదితరులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్‌గా నవజ్యోతి...

సమావేశం వేదికగా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యవర్గం ఏర్పాటైయింది. వేదిక ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్‌గా కోలా నవజ్యోతి, కో-కన్వీనర్లుగా బి.శ్రీనివాస్ నాయక్, వేల్పూరి నరసింహారావు, ఎన్ పోతురాజు, ఉన్నం రాణి, డి.సుధాకర్, ఎస్.నీలాంబరం, ప్రభాకర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ప్రసాద్ (విరసం), కె.రవిచంద్ర (నిర్బంధ వ్యతిరేక పోరాట కమిటీ) వై. వెంకటేశ్వరరావు (పీడీఎం), బి.కొండారెడ్డి (పీకేఎస్), బి.అంజమ్మ (అమరుల బంధుమిత్రుల సంఘం), పొటిబండ్ల కోటేశ్వరరావు (ప్రజా పోరు), సాదు మాల్యాద్రి (బహుజన పొలిటికల్ సెంటర్) డేన్నిస్ రాయ్ (బహుజన డెమొక్రటిక్ ఫ్రంట్), ఎస్కే ఖాజావలి (ముస్లిం హక్కుల పోరాట కమిటీ), కె.కృష్ణ (కేఎన్‌పీఎస్), కోటేశ్వరరావు (సీఎల్‌సీ) ఎస్కే మస్తాన్‌వలి (పీడీఎం) తదితరులు ప్రసంగించారు.

అందరూ సుభిక్షంగా ఉండాలి



పూజలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఆలయం వద్దకు వస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, రైతులు, కర్షకులు, కార్మికులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఆదివారం జానపాడు గ్రామంలోని నీలంపాటి అమ్మవారి దేవాలయంలో తిరునాళ్ల సందర్భంగా పూజా కార్యక్రమాలలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని దేవుడిని కోరుకున్నట్లు తెలిపారు. తొలుత వీరాపురం సమీపంలోని శాంతినగర్ వద్ద శ్రీసాయి తిరుమల బయో ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, గండికోట వెంకటేశ్వర్లు, వున్నం నరసింహారావు, కనిగిరి శ్రీను, పాండురంగ శ్రీను, వున్నం వెంకట్రావు, కోట శ్రీను, పాల శ్రీను, కూరపాటి కొండలరావు, వున్నం సురేష్, చింతలపూడి రామ్మూర్తి, వెంకటేష్, ఖాశిం, నెల్లూరు శ్రీను, బండ్ల శ్రీను, వేముల తిరుమల కుమార్ పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణానికి పటిష్ట బందోబస్తు

- ఎస్పీ సతీష్ కుమార్



వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న రాజధానిలోని వెంకటపాలెంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన వెంకటపాలెంలోని ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాస కల్యాణ మహోత్సవ కార్యక్రమం సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న వాహనాల పార్కింగ్ ప్రదేశాలను, వాహనాల రాకపోకలకు కేటాయించిన మార్గాలను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. వీవీఐపీ, వీఐపీ, భక్తుల వాహనాల రాకపోకలకు సంబంధించి ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్, ఇతర పోలీస్ అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవికుమార్, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ , తుళ్లూరు సీఐలు గంగా వెంకటేశ్వర్లు , అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం జరగాల్సిన గ్రీవెన్స్ కొద్ది వారాలుగా నిలిచిన విషయం విదితమే. నేటి నుంచి తిరిగి ప్రారంభమవుతుందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. సోమవారం ప్రజా ఫిర్యాదులు - పరిష్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నామనీ, ప్రజలు నేరుగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు విన్నవించుకోవడానికి గుంటూరులోని పోలీస్ కార్యాలయానికి రావచ్చని ఎస్పీ తెలిపారు.


జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభం



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ రాష్ట్ర నాయకులు

రాజుపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులగణపవరం గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి వారి 96వ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు ఆదివారం ప్రారంభమైయ్యాయి. సత్తెనపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, మన్నెం శివనాగమల్లేశ్వరరావు, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, పూజల వెంకట కోటయ్య, పల్లపాటి రాములు, నర్రా మల్లయ్య, మర్రి వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పోటీలలో మొత్తం 6 ఎడ్లజతలు పాల్గొన్నాయి. నాలుగుపళ్ల పందేలలో బాపట్ల జిల్లా జె.పంగులూరు గ్రామానికి చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ యూత్ చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్లజత నిర్ణీత 15 నిమిషాల వ్యవధిలో 5,278.6 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండల పాతమాగులూరుకు చెందిన చీరబోయిన కోటేశ్వరరావు ఎడ్లజత 4250 అడుగుల దూరం లాగి రెండవ స్థానంలో, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవులూరుకు చెందిన బత్తుల శ్రీనివాసరావు ఎడ్లజత 4000 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం భీమవరంకు చెందిన దివ్యశ్రీ ఎడ్లజత 3027 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో, పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం నిండుజర్లకు చెందిన ఎడ్లజత 2250 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో, బాపట్ల జిల్లా భట్టిప్రోలుకు చెందిన కూరేటి చినబసవయ్య మెమోరియల్ ఎడ్లజత 1407 అడుగుల దూరం లాగి ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యజమానులకు నగదు బహుమతులతోపాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

జీఎస్‌టీ ఆఫీసు సబార్డినేట్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాసరావు | చెన్నకేశవులు

తిరుపతి(నేర విభాగం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేల్స్ ట్యాక్స్ ఆఫీసు సబార్డినేట్ల సంఘం (జీఎస్‌టీ) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని తిరుపతి జీఎస్‌టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర అధ్యక్ష పదవికి గోపాలకృష్ణ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో నూతనంగా ఆర్. శ్రీనివాసరావును(విజయవాడ) కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. వీరితో పాటు చెన్నకేశవులు(గుంటూరు) ప్రధాన కార్యదర్శిగా, ఆర్.సత్యనారాయణను కార్యాలయ కార్యదర్శిగా, జగన్నాథంను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మొత్తం 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ క్రమంలో ముందుగా నూతన కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించాలని భావించినా ఆఖరి నిమిషంలో సభ్యులందరూ కలసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆఫీసు సబార్డినేట్ సిబ్బందికి రావాల్సిన సౌకర్యాలు, ఇతర ప్రయోజనాలపై ప్రభుత్వంతో చర్చించి న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 100 మంది సభ్యులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 523.90 అడుగులు ఉంది. ఇది 156.48 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8986, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,999 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	88, 95, 105
చికెన్ విత్ స్కిన్	170.00
చికెన్ స్కిన్ లెస్	180.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 30.58 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామని రాజు తెలిపారు.

నేడు నకరికల్లులో గ్రీవెన్స్

నకరికల్లు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కట్టికోట పుల్లారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని, ప్రజలు గమనించాలని గ్రీవెన్స్‌కు తరలిరావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

మాచర్లటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన ఆదివారం మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని 10వ వార్డుకు చెందిన అన్నెబోయిన అమరలింగం (40) తాపీ మేస్త్రిగా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఇంటి నుంచి సెంటర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గ మధ్యంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అమరలింగం అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య వీరమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

మాచర్లటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పలువురు సీఎం సహాయనిధి లబ్ధిదారులకు ఆదివారం చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలోని 42 మంది లబ్ధిదారులకు రూ. 58.71 లక్షల విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న సీఎం సహాయనిధిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా ముటుకూరు తిరునాళ్ల

దుర్గి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరులో ఆదివారం మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 9 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ జగదీష్, దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్ ఆధ్వర్యాన 200 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

చలివేంద్రం ప్రారంభం

గురజాలటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన పట్టణంలోని ఆరు ప్రాంత్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయగా ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు, మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్ నేలవల్లి బొల్లయ్య, మాజీ ఎంపీటీసీ శరమాల హనుమంతురావు, జనసేన నేత బడిదెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి వినతిని అందచేస్తున్న హనిమిరెడ్డి

'పది' విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

రెంటచింతల, మార్చి 9, (ఆంధ్రజ్యోతి): 17వ తేది నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రెంటచింతలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో తుమ్మకోట, పాలువాయి, రెంటాల, మిట్టగుడిపాడు, జెట్టిపాలెం గ్రామాల నుంచి పదో తరగతి విద్యార్థులు 171 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఆ విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం 8 గంటలకు ఆయా గ్రామాల నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ పాలువాయి సర్పంచ్ మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి కుమారుడు హనిమిరెడ్డి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఆర్టీసీ డీఎం బత్తుల వీరాస్వామితో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపించి ఉచిత బస్సును వినియోగించుకోవచ్చని డీఎం అన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టి.కోటిరెడ్డి, పాశం తుఫాన్‌రెడ్డి, కె.సాంబ, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో ఆటోనగర్ !

- ఏపీఐఐసీ స్థలంలో వెలుస్తున్న అనధికార నిర్మాణాలు
- ఆందోళన చెందుతున్న మెకానిక్‌లు
- దశాబ్దాల కల నిరీక్షణ ఫలించేనా..?



ఆటో నగర్ స్థలంలో ఏర్పాటైన ఇల్లు, ఆక్రమించేందుకు తోలిన రాళ్లు

మాచర్లటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాల మెకానిక్‌ల కల ఇప్పటికీ కలగానే మిగిలింది.. తమ బతుకులు బాగుపడతాయి కదా అని తలాకొంత చందాలు వేసి అధికారులకు ముట్టజెప్పారు.. అయిన ప్పటికీ ఫలితం లేకపోయింది.. అదిగో చేస్తాం.. ఇదిగో చేస్తామంటూ అధికారులు కాలం వెళ్లదీసుకువచ్చారు. ఫలితంగా ఎన్నో ఆశలు పెంచుకున్న ఆటో నగర్ స్థలం ఇప్పుడు ఆక్రమణ చెరలోకి చేరింది. ఆ స్థలంలో ఒకట్రెండు ఇళ్ల నిర్మాణాలు జరుగగా మరికొన్ని బేసి మట్టాలు స్థాయిలో ఉన్నాయి.

సుమారు రెండు దశాబ్దాల క్రితం..

రాజీవ్ నగరబాట సందర్భంగా 2006, ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాచర్లకు వచ్చిన సందర్భంలో సుమారు 100 మంది మెకానిక్‌లు ఆయన్ను కలిసి నడిరోడ్డుపై బతకలేకపోతున్నామని, ఆటోనగర్ నిర్మించి ఇస్తే అనువుగా ఉంటుందని గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన సీఎం సరేనన్న ఏడాదికి రెవెన్యూ యంత్రాంగం మాచర్ల - శ్రీశైలం ప్రధాన రహదారిలో సర్వే నంబరు 1461/2లో 11.3 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. తమవంతు కంట్రీబ్యూషన్‌గా మెకానిక్‌లు తలాకొంత వేసుకొని రూ. 1.10 లక్షలు ఏపీఐఐసీ (ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్)కు అందించారు. అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ఆటోనగర్ అవసరాలకు తగ్గట్టుగా 110 షాపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. పిల్లర్లను కూడా నిర్మించారు.

అనంతరం ఆగిన నిర్మాణాలు ..

ఏపీఐఐసీ అధికారులు ఆటోనగర్‌కి కేటాయించిన స్థలం నివేదికను ఆర్‌అండ్‌బీ (రోడ్స్ అండ్ బిల్డింగ్స్) శాఖకు పంపారు. శ్రీశైలం - గుంటూరు, నాగార్జున సాగర్ - గుంటూరు మార్గాలకు మాచర్ల పట్టణం నడిబొడ్డు నుంచి కాకుండా ఆటోనగర్ కేటాయింపు స్థలం నుంచి బైపాస్ రోడ్డు వేయాలన్న ప్రతిపాదన తమవద్ద ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు సెలవిచ్చారు. ఆటోనగర్ నిర్మాణం జరిగినా బైపాస్ రోడ్డు ఏర్పడితే 40 శాతం నిర్మాణాలను ఏపీఐఐసీ నష్టపోవాల్సి ఉంటుందని రిమార్కుల్లో పేర్కొన్నారు. దీంతో ఏపీఐఐసీ వెనక్కు తగ్గి ఆటోనగర్ నిర్మాణం ప్రతిపాదనను నిలిపివేసింది.

పెరుగుతున్న ఆక్రమణలు

ఇటీవల కాలంలో ఆటోనగర్ స్థలంలో ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఒకరిద్దరు ఇళ్ల నిర్మించుకొని జీవిస్తుండగా మరికొందరు బేస్ మట్టాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇంకొందరు మాత్రం స్థలంలో రాళ్లు తోలుకొని ఆక్రమించేశారు. గతంలో ఉన్నతాధికారులు సదరు స్థలంలో పర్యటించి ఆక్రమణలను గుర్తించారు. ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానిక రెవెన్యూ అధికారులను సూచించారు. దీంతో అప్పట్లో హడావుడిగా ఆక్రమణలను పరిశీలించి ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. కానీ ఆక్రమణలకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోయారు.



ఆటోనగర్ ప్రతిపాదిత స్థలం

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

- మాచర్ల పట్టణ ఎస్ఐ సంధ్యారాణి





మాచర్లటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. వాహనాలను పార్కింగ్ స్థలాల్లో మాత్రమే నిలపాలని, ఆటోలు పట్టణానికి బయట నిలుపుకొని సీరియల్‌గా పట్టణంలోకి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించాం. పట్టణ ఎస్ఐ సంధ్యారాణితో ఆంధ్రజ్యోతి ఫటాఫట్...

- **మైనర్లు వాహనాలు నడుపుతున్నారు కదా..?**
  వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నాం. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇస్తున్నాం.
- **అసాంఘిక కార్యకలాపాలపై కట్టడికి ఏం చేస్తున్నారు?**
  పట్టణంలో నాటుసారా, గంజాయి, పేకాట, నంబర్లాట, మట్కా వంటి జూదాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచాం. స్థావరాలపై దాడి చేసి కేసులు నమోదు చేస్తున్నాం.
- **దొంగతనాల నిరోధించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?**
  పట్టణంలో రాత్రి వేళల్లో గస్తీ పెంచాం. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశాం. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలి.
- **మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారా ?**
  పాఠశాలల, కళాశాలల్లో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాం. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ నిరోధక చట్టం, శిక్షలను గురించి వివరిస్తున్నాం
- **రోడ్డు భద్రతా చర్యలకు ఏం చేస్తున్నారు ?**
  రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి వాహన చోదకుడు హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నాం. లైసెన్సు లేకున్నా, హెల్మెట్ ధరించకున్నా, ధ్రువీకరణ పత్రాలు లేకున్నా, మద్యం తాగి వాహనం నడిపినా జరిమానా విధిస్తున్నాం. అలాగే రోడ్డ భద్రతా నియమాలు పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- హామీలు నెరవేర్చితేనే తిరిగి ఓట్లు అడుగుతాను
- రైతు ధర్నా పేరుతో జగన్ కొత్త నాటకం
- పిన్నెల్లి నీ రాజకీయ సన్యాసం ఎప్పుడు ?
- మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి
- బుగ్గవారు రిజర్వాయర్‌లో చేప పిల్లల విడుదల



బుగ్గవాగు రిజర్వాయర్‌లోకి చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

దుర్గి,మార్చి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, మత్స్య సంపదను పెంచేందుకు నిబద్ధతతో పని చేస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మత్స్యశాఖ ఆధ్వర్యాన మండలంలోని ఆత్మకూరు శివారు వద్దనున్న బుగ్గవాగు రిజర్వాయర్‌లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి 15 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ఇప్పటికే నెట్‌లు, బోట్లు, వేట నిషేధిత కాలలో మత్స్య భృతి అందిస్తున్నట్లు చెప్పారు. నదుల అనుసంధానంతో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని, అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కింద ఉన్న మేజర్లకు సాగునీటిని అందించామన్నారు. నియోజకవర్గంలో రూ.1200 కోట్లతో రక్షిత మంచినీటి పథకం కింద ప్రతి ఇంటికి తాగునీటిని అందజేస్తామన్నారు. వచ్చే నెలలో దీనిపై టెండర్లు పిలుస్తామన్నారు. అలాగే వరికపూడిశెల నిర్మించి శాశ్వత తాగు, సాగునీటి కష్టాలను తొలగిస్తామన్నారు. 2024 ఎన్నికల హామీలను నెరవేర్చిన తరువాతే తిరిగి వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని, అలా కాకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. వరికపూడిశెల ప్రాజెక్ట్‌ను పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న పిన్నెల్లి ఆ పని ఎప్పుడు చేస్తావంటూ ప్రశ్నించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతులను గాలికి వదిలేసిన జగన్‌మోహన్ రెడ్డి నేడు రైతు ధర్నా పేరుతో కొత్త నాటకానికి తెర తీస్తున్నారని ఎద్దేవా చేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అవినీతి, ఆక్రమాలను, భూదందాలను బట్టబయలు చేసి ప్రజా కోర్టులో అతడిని దోషిగా నిలబెడతానని ఎమ్మెల్యే జూలకంటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి ఎస్ సజీవరావు, తహసీల్దార్ ఫణీంద్రకుమార్, ఏవో అమ్మిరెడ్డి, శ్రీనివాసరావు, పంగులూరి పుల్లయ్య, కంభంపాటి అనిల్, జి వెంకట్రామిరెడ్డి, ముత్తినేని పుల్లయ్య, దేవరగట్టు బ్రహ్మయ్య, రామాంజనేయులు, ప్రియదర్శిని, యశోద, కూటమి నేతలు పాల్గొన్నారు.



సూర్యా సెమ్ సిబ్బందికి వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, సంస్థ సీఎండీ కొత్త చినసుబ్బారావు

సూర్యా సెమ్ 39వ వార్షికోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సూర్యా సెమ్ సంస్థ 39వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో డిలైట్ కెమికల్స్ కంపెనీ స్థాపించి క్రమంగా డిలైట్‌కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా ఏర్పడి సూర్యా సెమ్ బ్రాండ్‌తో పలు రాష్ట్రాలలో ఖాతాదారుల మన్ననలు పొందటమే కాకుండా ఎంతో మంది కార్మికులకు ఉపాధి కల్పించిందని, అంటూ సంస్థ యాజమాన్యాన్ని అభినందిచారు. అనంతరం సంస్థ సిబ్బందికి ఎమ్మెల్యే యరపతినేని నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సీఎండీ కొత్త చినసుబ్బారావు, కొత్త శివయ్య, నరేంద్ర, బిబి సూర్య, వి.అనిల్, విఆర్‌బి ప్రసాద్, డాక్టర్ వై సురేష్, కె సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

184 మందికి కంటి పరీక్షలు

రెంటచింతల,మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శంకర నేత్రాలయం, చల్లగుండ్ల ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రెంటచింతల శివాలయం ఆడిటోరియంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు 184 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 66 మందికి శుక్లాల ఆపరేషన్ కోసం సిఫార్సు చేశారు. వారందరికీ ఉచితంగా శుక్లాల ఆపరేషన్ చేయనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు చిరంజీవి, వందన, గుండా జనార్ధన, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, పెదబాబు, వైవీ సైదయ్య జానకిరామ్, రాంబాబు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలకు వెండి కవచాలు బహూకరణ

మాచవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లుట్ల గ్రామశివారు సింగరుట్ల లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ వార్షిక తిరునాళ్ళ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు ఆదివారం వెండి కవచాలను బహూకరించారు. పిల్లుట్ల గ్రామానికి చెందిన జీవీజీకే రెడ్డి కుమారుడు గోపీ శ్రీధర్‌రెడ్డి దంపతులు పిల్లుట్ల గ్రామంలోని శివాలయంలో జరిగిన ఉత్సవ విగ్రహాలకు పూజా కార్యక్రమాలు చేసి వెండి కవచములను అందజేశారు. సుమారు రూ.3 లక్షలు విలువ కలిగిన వెండి కవచములను ఆలయ పూజారులకు అందజేశారు. ఈ సందర్భంగా పూజారులు వారిని అభినందించారు.

క్రోసూరులో పీ-4 సర్వే ప్రారంభం

క్రోసూరు,మార్చి9 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులో పీ-4 సర్వే ప్రారంభమైందని ఎంపీడీవో జీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వే సిబ్బంది ఇంటింటికి తిరిగి ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతుల వివరాలు నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వం నుంచి సాధ్యమైనంత సంక్షేమాన్ని అందించటమే పీ-4 సర్వే ఉద్దేశమని అన్నారు. ఉగాది నుంచి సర్వే ఫలితాలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సర్వే సిబ్బంది క్రోసూరులోని అన్ని కాలనీల్లో తిరిగి ప్రజలకు సర్వే గురించి తెలియజేయాలని సూచించారు. అలాగే సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఎంపీడీవో కోరారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి) : మండలంలో పీ - 4 సర్వే ముమ్మరంగా కొనసాగుతుందని ఎంపీడీవో కె. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం తాడువాయి గ్రామాన్ని ఎనిమిది క్లస్టర్లుగా విభజించి అధికారులు సర్వే నిర్వహిరచారని, గ్రామంలో 550 కుటుంబాలన్నాయని, 18వతేదిలోపు సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. సర్వేలో వీఆర్‌వోఆదిలక్ష్మి పాల్గొన్నారు.

80 మందికి రక్తనాళాల పరీక్షలు

అమరావతి, మార్చి9 (ఆంధ్రజ్యోతి) సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏసియన్ వాస్కులార్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం స్థానిక త్రిశక్తి పీఠంలో 80 మందికి రక్తనాళాల పరిక్షలను నిర్వహించారు. వైద్యశిబిరంలో 80 మంది రోగులు పరీక్షలు చేయించుకోగా వారిలో 30 మందికి రక్తనాళాల సమస్యను గుర్తించి శస్త్రచికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళతామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు చేకూరి జాజిబాబు, వైద్యశాల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు తప్పక హాజరు కావాలి

బెల్లంకొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల సంబంధిత అధికారులు తప్పకుండా హాజరు కావాలని తహసీల్దార్ ఎండీ అస్రిఫున్నీసా బేగం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని ఆదేశించారు. ఎవరైనా అధికారులు గైర్హాజరైతే కలెక్టర్‌కు సిఫార్స్ చేస్తానని హెచ్చరించారు.

రోడ్డు మరమ్మతు చేయండి

దాచేపల్లి, మార్చి9 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి-తంగెడ గ్రామాల మధ్య ఉన్న 20 కిలో మీటర్ల రోడ్డు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ గ్రామస్థులు ఆదివారం మండలంలోని ముత్యాలంపాడు గ్రామ సమీపంలో వాహనాల రాకపోకలను అడ్డుకుని ధర్నా చేశారు. రోడ్డు అధ్వానంగా తయారై నెలలు గడుస్తున్నా పట్టించుకున్న వారే లేరన్నారు. అధికారులు తక్షణమే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ భాస్కరరరావు గ్రామానికి వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడి, సర్ది చెప్పారు. దీంతో గ్రామస్థులు ధర్నాను విరమింప చేశారు.



గుంటుపల్లి నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

నిబద్ధత కలిగిన నాయకుడు గుంటుపల్లి

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
- దాచేపల్లిలో నాగేశ్వరరావు విగ్రహం ఆవిష్కరణ

దాచేపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, నవ్యాంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేస్తూనే, టీడీపీ అభ్యున్నతికి అహర్నిశలు పాటు పడిన నిబద్ధత కలిగిన నాయకుడు గుంటుపల్లి నాగేశ్వరరావు అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం దాచేపల్లిలో గుంటుపల్లి నాగేశ్వరరావు ప్రథమ వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులు ఏర్పాటుచేసిన గుంటుపల్లి విగ్రహాన్ని ఎమ్మెల్యే యరపతినేని ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావుతో కలసి ఆవిష్కరించారు. అనంతరం యరపతినేని మాట్లాడుతూ గుంటుపల్లి కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తంగెళ్ళ శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, నర్ర పుల్లయ్య, అక్కినపల్లి బాలయ్య, సొసైటీ నారాయణ, వేముల తిరుమలకుమార్, పగడాల భాస్కరరావు, నెల్లూరి రామకోటయ్య, కోరె రామారావు, బొమ్మిరెడ్డి సత్యం, కూరాకుల నాగేశ్వరరావు, గుదె సైదయ్య, రుద్రాల అంచ్చారావు, చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ పాఠశాలలో సమావేశమైన 1974-75 పదవ తరగతి పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పిడుగురాళ్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్లో 1974-75 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు రాష్ట్రానే కాకుండా పలు రాష్ట్రాల్లో స్థిరపడిన వారు ఒకచోట చేరి ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ బ్యాచ్‌లో పలువురు బ్యాంక్ మేనేజర్లుగా, ఏపీ ఇన్‌ఫర్మేషన్ జాయింట్ డైరెక్టర్‌గా, ఫిల్మ్ ఇండస్ట్రీ, ఉపాధ్యాయ, వ్యాపార వర్గాలలో స్థిరపడిన వారు వున్నారు. కార్యక్రమంలో భవనాశి యల్లారావు, మందా జాకబ్, గుదె రామకృష్ణ, మేకా సురేష్, మీసాల అశోక్‌కుమార్, పెద్దింటి నరసింహమూర్తి, విశ్రాంత డిపిఆర్‌ఓ లాల్‌జాన్, పాల్గొన్నారు.

పిడుగురాళ్ల అంటే ఎంతో ఇష్టం : సినీనటుడు సురేష్

'ముప్పై ఏళ్లుగా తెలుగు సినిమా రంగంలో ఉంటూ అనేక సినిమాలలో నటించాను. పిడుగురాళ్ల అంటే ఇప్పటికీ ఎంతో ఇష్టం. ఆనాడు చదువు నేర్పిన గురువుల క్రమశిక్షణతో బ్యాంక్ మేనేజర్‌గా పని చేస్తూనే పలు సినిమాల్లో నటించాను. వీలు కుదిరినప్పుడల్లా పిడుగురాళ్లకు వచ్చి పాత స్నేహితులను కలిసి, పాఠశాలను చూసి వెళ్తుంటాను'.



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మహిళా ఉద్యోగులకు ఘన సత్కారం

పెదకూరపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లగడపాడు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకొని నేడు వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థినులను ఆదివారం పాఠశాలలో ఘనంగా సత్కరించినట్లు పూర్వ విద్యార్థి ఖిల్లాపల్లి సత్యం తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సన్మాన గ్రహీతలు, ఇంటూరి అన్నమ్మ, సువర్ణ లక్ష్మి తదితరులు మాట్లాడుతూ స్త్రీలు ఎక్కడ పూజించ బడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పద్మారావు, లక్ష్మణ్, చంద్రం, పుష్పలీల, సుశీల, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో క్రీడా వేదికను నిర్మిస్తాం..

పెదకూరపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడా వేదిక నిర్మాణం చేస్తానని మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ అన్నారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రమేష్ సతీష్‌మాణి, మాజీ సర్పంచ్ నలిని జ్ఞాపకార్థం రూ.50వేలతో నిర్మించనున్న కీడా వేదికకు ఆదివారం శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ వెంకట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా వేల్పూరు ఎస్సీ కాలనీ

- 30 సంవత్సరాలు దాటినా మట్టి రోడ్లే..
- పని చేయని తాగునీటి బోర్లు
- ప్రభుత్వాలు, అధికారులు మారినా మారని పల్లె జీవన చిత్రం

అచ్చంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పల్లె బాటలు, రచ్చబండలు, అధికారుల కాలనీల సందర్శనలు, రెవెన్యూ సదస్సులు ఇవేవీ ఈ కాలనీని తాకలేదు. రాజధానికి సమీపంలోవున్న అచ్చంపేట మండలం వేల్పూరు న్యూ ఎస్సీ కాలనీలో సమస్యలు తాండవిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేక పోవటంతో కాలనీ



మరమ్మతునకు గురైన బోరు



కాలనీలో అధ్వాన్నంగా ఉన్న మట్టి రోడ్డు

వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వేల్పూరు ఎస్సీ న్యూ కాలనీకి ప్రభుత్వం 30 సంవత్సరాల క్రితం పట్టాలు మంజూరు చేసింది. ఇప్పటికీ కాలనీలో ఒకటి రెండు చిన్న చిన్న సీసీ రోడ్లు మినహా అన్ని మట్టి రోడ్లే దర్శన మిస్తున్నాయి. పాడై పోయిన నీటి బోర్లు మరమ్మత్తులకు నోచుకోక పోవడంతో ప్రజల దాహార్తితో అల్లాడి పోతున్నారు. ఇల్లు నిర్మించుకుందామన్నా నీరు లేక వాయిదా వేసుకున్నారు. గతంలో మురుగు కాలువల నిర్మాణం కోసం మట్టిని తవ్వారు. అనంతరం కాలువ నిర్మించింది లేదు, గుంతలు పూడ్చింది లేదు. వర్షాకాలంలో వర్షపు నీరు కాలనీలో తాండవిస్తుంది. కాలనీ బురదమయమై నడిచేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది. కూటమి ప్రభుత్వమైనా కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి తమ కష్టాలను తొలగించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

కనీసం మంచి నీరైనా ఇవ్వండి



- నందిగం కనకాంబరం,

తాగేందుకు మంచి నీరు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇంట్లో అవసరాలకు ఇతరుల మీద ఆధార పడుతున్నాం. కనీసం బోర్లు మరమ్మతులైనా చేయండి.

ఎవరికి విన్నవించినా ప్రయోజనం లేదు



- ముత్యాల నరేంద్ర

మా కాలనీలో సమస్యల గురించి ఇప్పటికి ఎన్నో సార్లు నాయకులు, అధికారులకు చెప్పినా ఎవ్వరూ పట్టించుకుంది లేదు. ఇప్పటికైనా స్పందించి మా కాలనీ అభివృద్ధికి కృషి చేయండి.



బోయపాలెం-చెంఘీజ్‌ఖాన్‌పేట సీసీ రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

ఆరు నెలల్లో రహదారుల నిర్మాణం పూర్తిచేయాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

● రూ.6.15 కోట్లతో నిర్మించనున్న బోయపాలెం-గోపాలపురం సీసీరోడ్డుకు శంకుస్థాపన

యడ్లపాడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలంలో చేపట్టిన రోడ్ల నిర్మాణాలన్నింటినీ ఆరు నెలల్లోగా పూర్తిచేస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని బోయపాలెం నుంచి చెంఘీజ్‌ఖాన్‌పేట వరకు రూ.6.15 కోట్లతో నిర్మించనున్న 3.8కి.మీ.ల సీసీ రోడ్డు నిర్మాణపనులకు ఆయన ఆదివారం భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రధాన రహదారుల మరమ్మతులు, నిర్మాణ పనుల్ని కూటమి ప్రభుత్వం ఇప్పటికే 90శాతంకు పైగా పూర్తిచేసిందన్నారు. వర్షాకాలం ఆరంభమయ్యే నాటికే రోడ్డు పనులను పూర్తిచేయాలని, పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా నాణ్యతాప్రమాణాలు తగ్గకుండా రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. బోయపాలెం పరిధిలో రోడ్డుకు ఇరువైపులా 500మీటర్ల డ్రెయినేజి నిర్మాణం కూడా పూర్తిచేయాలన్నారు. అలాగే బోయపాలెం-లింగారావుపాలెం రహదారి నిర్మాణానికి కూడా అనుమతులు వచ్చాయని, త్వరలోనే ఆ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే బాధ్యులైన వారిపై కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజా రమేష్, టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.



ఐఏఎస్ అధికారి కృష్ణతేజను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సమక్షంలో సత్కరిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త దంపతులు

ఐఏఎస్ కృష్ణతేజకు ఘన సత్కారం

నరసరావుపేట టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి మైలవరపు కృష్ణతేజను మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త దంపతులు ఆదివారం నరసరావుపేట పట్టణంలో ఘనంగా సత్కరించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. భువనచంద్ర టౌన్ హాల్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై జిల్లాస్థాయిలో క్షేత్ర సహాయకులకు శిక్షణా కార్యక్రమానికి కృష్ణతేజ హాజరయ్యారు. కృష్ణతేజ మాజీ మున్సిపల్ చైర్మన్, ఎస్ఎస్ఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త సమీప బంధువు, స్థానిక ఎస్ఈసీ కళాశాల పూర్వ విద్యార్థి. మొదటిసారి అధికారిగా నరసరావుపేటకు రావడంతో సత్కరించారు. కార్యక్రమలో నాగసరపు రూపేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి తిరునాళ్ళ

రొంపిచర్ల, మార్చి 9(ఆంధ్రజోతి): మండలంలోని గోగులపాడు గ్రామంలో ఉన్న సువర్చలా సమేత అభయాంజనేయ స్వామి తిరునాళ్ళ ఆదివారం వైభవంగా జరిగింది. వేకువజామున స్వామివారికి పంచామృతాభిషేకం, నాగవల్లి దళార్చన పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు.

వాట్సప్ ద్వారా ఎస్ఎస్‌సీ దూరవిద్య హాల్ టిక్కెట్లు

నరసరావుపేట కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించు ఎస్ఎస్‌సీ దూరవిద్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థు లు తమ హాల్ టిక్కెట్లను వాట్సప్ మన మిత్ర ద్వారా పొందవచ్చని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 95523 00009 వాట్సప్ నెంబరు నుండి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. అలాగే స్టడీ సెంటర్ల నుండి నేరుగా పొందవచ్చ న్నారు. సార్వత్రిక పీఠం వెబ్‌సైటు నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట, నాదెండ్ల మండలాలకు చెందిన 34 మంది పేదలకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.37లక్షలకు పైగా విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోట రాజారమేష్, టీడీపీ చిలకలూరిపేట, నాదెండ్ల మండల అధ్యక్షులు జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం

వినుకొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంకాలమ్మ దేవాలయం ఆవరణలో మానవ సేవా సమితి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పీవీ సురేష్ బాబు, ప్రధానకార్యదర్శి చామర్తి భవానీశంకర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. కార్యక్రమంలో సమితి ట్రెజరర్ వెంకట్రావు, కరీముల్లా, తిరుమల, జాబీర్, నాగార్జున, హరీష్, చంద్, అశోక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

13న వడ్డే రాజుల నూతన కార్యవర్గ ఎన్నిక

వినుకొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వడ్డే రాజుల నూతన కార్యవర్గ ఎన్నిక ఈ నెల 13వ తేదీన స్థానిక నరసరావుపేట రోడ్డులోని వడ్డే ఓబన్న విగ్రహం వద్ద కేజీఎస్ కల్యాణమండపం నందు జరుగుతుందని నాయకులు పల్లపు వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాసరావు, చల్లా కుమార్‌లు తెలిపారు. స్థానిక ఏనుగుపాలెం రోడ్డులో మిర్చియార్డులో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వడ్డే సంఘం పెద్దసంఖ్యలో పాల్గొని ఓటును వినియోగించుకోవాలని కోరారు.

మాలమహానాడు పట్టణ నూతన కమిటీ ఎంపిక

వినుకొండటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మాల మహానాడు అధ్యక్షుడు రాయని చిన్న అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణ ఉపాధ్యక్షుడిగా కొట్టె మనోజ్, కార్యదర్శిగా అంబడిపూడి శ్రీను, కోశాధికారిగా పెనుమాల రమేష్, గౌరవాధ్యక్షుడిగా బిళ్లా ఇశ్రాయేలును నూతనంగా ఎంపికచేసి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాలల సమస్యలపై ప్రతిఒక్కరూ ఐక్యమవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో బొందలపాటి నాగేశ్వరరావు, కొమ్మతోటి కృపయ్య, పెనుమాల వెంకట్రావు, ప్రకాష్, భాస్కర్, దారా పాపారావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కుంటుపడిన అభివృద్ధి

● గ్రామపాలన వైపు కన్నెత్తి చూడని వైసీపీ సర్పంచ్

● పారిశుధ్య సమస్యలు పట్టని స్థానిక అధికారులు

● మౌలిక వసతులు కరువై గగ్గోలు పెడుతున్న పోట్లూరు గ్రామస్థులు



మురుగు కాల్వలో నీరు పోకుండా అడ్డుపడుతున్న చెత్త



రోడ్డు ప్రక్కన పడేసిన చెత్తచెదారాన్ని తొలగించని దృశ్యం



మురికికాలువలో పూడిక తీయక నిలిచిన మురుగునీరు



పోట్లూరులో నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకం

పోట్లూరు(శావల్యాపురం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): మౌలికవసతులు లేక. అభివృద్ధికి నోచుకోక శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో గ్రామంలో అభివృద్ధి పథకాలన్నీ నిర్వీర్యంగా మారాయి. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరఫున సర్పంచ్‌గా గెలిచిన మహిళ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామపాలనను పూర్తిగా వదిలేశారు. గత 8 నెలల నుండి గ్రామంలో ఇంటింటికీ చెత్తసేకరణ నిలిపివేయడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గ్రామంలోని మురికికాలువల్లో పూడిక తీసి మూడేళ్ళు గడుస్తుండడంతో దోమలకు నిలయాలుగా మారాయి. మంచి నీటి పథకం నుండి 8 నెలలుగా తాగునీరు వదలకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో గ్రామంలో వీధిలైట్లు వెలగక బయటకువెళ్ళాలంటే మహిళలు, పిల్లలు భయపడుతున్నారు. హిందూ శ్మశానవాటిక ఐదేళ్ళుగా మరమ్మతులకు నోచుకోలేదు. ఇటీవల గ్రామంలో 70 కుక్కలను సర్పంచ్ పట్టించి వాటిని చంపి బీసీకాలనీ పక్కన దహనం చేయించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఊరచెరువు వేలం నిర్వహించారు. అయితే స్థానిక అధికారులు చెరువును ఖాళీ చేయించకుండానే తూతూ మంత్రంగా నిర్వహించారు. బహిరంగ ప్రకటన చేయకుండా గుట్టుచప్పుడు కాకుండా వేలం నిర్వహించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై స్థానిక అధికారులు సర్పంచ్‌కే వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పోట్లూరుకు ఐదేళ్ళుగా రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడం, ఇన్‌చార్జ్‌లతోనే కాలం గడుపుతుండడంతో గ్రామపాలన పూర్తిగా అటకెక్కిందని ప్రజలు వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి గ్రామ సమస్యలు వెంటనే పరిష్కరించి గ్రామపాలనను గాడిలో పెట్టేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

అధికారుల అండతోనే సర్పంచ్ నిర్లక్ష్యం

తెలుగుయువత మండల అధ్యక్షుడు గోనుగుంట్ల ధనుంజయ్



స్థానిక అధికారులు సర్పంచ్‌కి వత్తాసు పలుకుతుండడంతో వారి అండతో సర్పంచ్ గ్రామపాలన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్ళినా ప్రయోజనం లేదు. పారిశుధ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేపలచెరువు వేలాన్ని పారదర్శకంగా నిర్వహించకపోవడంతో పంచాయతీ ఆదాయానికి గండి పడింది.

పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా అధికారులు

సాగునీటిసంఘం మాజీ అధ్యక్షుడు పొందూరి సుబ్బయ్య



గ్రామంలో ఇంటింటికీ చెత్తసేకరణ నిలిచిపోయి ఎనిమిది నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సర్పంచ్ గ్రామపాలనపై నిర్లక్ష్యంగా ఉన్నారు. 8 నెలలుగా తాగునీటి పథకం నుండి గ్రామంలోకి నీరు వదలడం లేదు. వీధి దీపాలు వెలగడం లేదు.

ఎన్‌టీఆర్ అమలుచేసిన పథకాలు దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



ముఖద్వార శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు, పేర్ని వీర నారాయణ

నాదెండ్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టీఆర్ రాష్ట్రంలో అమలుచేసిన పథకాలు మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని గణపవరం మెయిన్ రోడ్డులో నిర్మాణం చేసిన ప్రత్తిపాటి పుల్లారావు ముఖద్వారాన్ని పారిశ్రామికవేత్త పేర్ని వీరనారాయణ, ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులు ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో పుల్లారావు మాట్లాడుతూ తెలుగు వారి హృదయాల్లో శాశ్వతస్థానం సంపాదించి ఎన్‌టీఆర్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆయన బాటలో చంద్రబాబు, లోకేశ్‌లు రాష్ట్రాభివృద్ధికి పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త నన్నపనేని భార్గవ్, డాక్టర్ సీహెచ్ రామకృష్ణ, డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, జనసేన నేత తోట రాజారమేష్, పార్టీ నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, కంచర్ల శ్రీను, కృష్ణారావు, కాట్రు శ్రీనివాసరావు, గాలి బుచ్చయ్య, నరసింహారావు, పీవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యశిబిరాన్ని ప్రారంభించి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

250 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

యడ్లపాడు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పుటిగంపు సరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో యడ్లపాడు నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యఅతిథిగా శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో 250మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. విజయవాడకు చెందిన హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పటల్ వైద్యబృందం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా గుంటూరు హెల్త్‌కేర్ ఆసుపత్రి వైద్యులు బీపీ, షుగర్, టూడిఎకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రధానంగా క్యాన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. శ్రీకృష్ణ మెడికల్ క్యాంపు ఆర్గనైజన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సంక్షేమ సంఘం నాయకుడు మురళీకృష్ణ, తెలుగుయువత నాయకులు పర్యవేక్షించారు.

నేత్రదానంతో ఆదర్శంగా నిలిచిన వేల్పూరు వాసి



కోటయ్య (ఫైల్‌ఫొటో)

వేల్పూరు(శావల్యాపురం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): మరణానంతరం తన నేత్రాలను మరొకరికి దానం చేసి శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన కంచర్ల చిన్నఆంజనేయులు ఎంతోమందికి ఆదర్శంగా నిలిచినట్లు అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు అన్నారు. వేల్పూరుకు చెందిన కంచర్ల చిన్న అంజనేయులు(55) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులు మృతుని నేత్రాలు దానం చేశారు. చలపతిరావు ఇచ్చిన సమాచారంతో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి ఐ-బ్యాంక్ సిబ్బంది వేల్పూరుకు వచ్చి మృతుడు చిన్నఆంజనేయులు కళ్ళలోని కార్నియా పొరలను సేకరించారు. చలపతిరావు మాట్లాడుతూ నేత్రదానం చేయదలచినవారు మృతదేహాన్ని ఏసీబాక్స్‌లో ఉంచి 8 గంటల్లోపు ఐ-బ్యాంక్ సిబ్బందికి సమాచారమివ్వాలన్నారు. నేత్రదానం చేసిన మృతుడు చిన్నఆంజనేయులు కుటుంబసభ్యులు అంజమ్మ, సుబ్రమణ్యం, సురేష్, ఆలపాటి శివ, మణికంఠ, పరమేశ్వరరావు, సుబ్బారావులను చలపతిరావు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

నేటి నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభం

బొల్లాపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం మండలంలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక బొల్లాపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఏ సుధాకర్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరవుతారన్నారు. ప్రజలు అర్జీలు అందజేసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

తలార్లపల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభం

నూజెండ్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తలార్లపల్లి గ్రామంలో మురుగు కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి టీడీపీ నాయకు లు శంకుస్థాపనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మం డల పార్టీ అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణయాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి నిధులు కేటాయించటం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఒంటేరు కొండలు, మాదాల యలమంద, తాడిపర్తి బ్రహ్మారెడ్డి, కిష్ట నాగమల్లేశ్వరరావు, ఎం వీరాచారి, ఎం పెద్దిరాజు, ఆర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

బొల్లాపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లిలో పేకాట స్థావరంపై దాడిచేసి ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.11వేలు స్వాధీనం చేసుకున్నట్లు బొల్లాపల్లి ఎస్ఐ ఏ బాలకృష్ణ ఆదివారం తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఎస్ఆర్‌కే ఫౌండేషన్ సేవలు అభినందనీయం

వేల్పూరు(శావల్యాపురం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎస్ఆర్‌కే ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్ఎంసీ చైర్మన్ దన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫౌండేషన్ అధినేత మారాసు రామయ్య ఆదివారం పరీక్షా సామాగ్రి, స్టేషనరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ పది పరీక్షల్లో విద్యార్థులంతా మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు సాధించిపెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొల్లా పేరయ్య, సాదినేని కృష్ణమూర్తి, దొడ్డా ఏడుకొండలు, లింగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు ఈపూరు ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ళ

ఈపూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఈపూరు బోటుమీద ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళ ఈనెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. తిరునాళ్ళ సందర్భంగా పరిసర గ్రామాల నుండి భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కుబడులు చెల్లించుకుంటారు. అదేరోజు రాత్రి గ్రామస్తులు నిర్మించిన విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.



ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, మూలవిరాట్

పంట సంజీవనితో రైతులకు ప్రయోజనకరం

ఫటా ఫట్

ఏపీవో ఆంజనేయరాజు



నూజెండ్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా పంట సంజీవని కార్యక్రమంలో భాగంగా సేద్యపు నీటికుంటల నిర్మాణం చేస్తున్నట్లు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఏపీవో ఆంజనేయరాజు ఆంధ్రజ్యోతికి వివరించారు.

ప్రశ్న: సేద్యపు నీటి కుంటలు రైతులకు ఏవిధంగా ఉపయోగపడతాయి?

ఏపీవో: వ్యవసాయం, పశుపోషణ, పండ్లతోటలు, పూలమొక్కల పెంపకానికి నీరు అత్యంత ప్రాధాన్యత ఉన్న దృష్ట్యా సంవత్సరకాలం పంటలను కాపాడుకొనేందుకు సేద్యపు నీటికుంటల్లో నిల్వ చేసుకున్న నీరు వారికి ఉపయోగపడుతుంది.

ప్రశ్న: ఎన్ని విధాలుగా సేద్యపు నిర్మాణ కుంటలు నిర్మిస్తారు?

ఏపీవో: ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పు, రెండుమీటర్ల లోతుతో 2.83 సెంట్ల స్థలంలో 98వేల లీటర్ల నీటినిల్వకు, 10/10/2, 5.70 సెంట్లలో 2.88 లక్షల లీటర్లు, 15/15/2 కొలతలతో 8.3 సెంట్ల భూమిలో 5.68 లక్షల లీటర్ల నీరు, 20/20/2 కొలతలలో 15.20 సెంట్ల భూమిలో 9.68 లక్షల లీటర్ల నీరు నిల్వవుండేలా సేద్యపు నీటికుంటల నిర్మాణం జరుగుతుంది.

ప్రశ్న: రాయితీ, లబ్ధిదారుల ఎంపిక ఏవిధంగా జరుగుతుంది ?

ఏపీవో: జాబ్‌కార్డు కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు తమ భూముల్లో తమకు అవసరమైన నీటికుంటల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న వారికి వందశాతం రాయితీపై ఉపాధి హామీ పథకం ద్వారా నీటి కుంటల నిర్మాణం చేస్తారు.

ప్రశ్న: మండలంలో ఉపాధి హామీ జాబ్‌కార్డుల సంఖ్య ఎంత?

ఏపీవో: మండలంలో 13,209 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉండగా 23,600మంది ఉపాధి హామీ కూలీలుగా పనులు చేస్తున్నారన్నారు.

ఘనంగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



ప్రతిభ చాటిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల 20వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ నేటి ప్రపంచం సాంకేతిక ఆవిష్కరణల ద్వారా వేగవంతంగా పురోగతి చెందుతోందన్నారు. కొత్త ఆలోచనలను అన్వేషించి వినూత్న పరిష్కారాలతో ముందుకురావడం ద్వారా ప్రపంచ సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు ఆ దిశగా భవిష్యత్ కార్యాచరణ ఎంచుకొని సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. కళాశాలలో ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకొని ఉన్నత స్థితికి ఎదగాలని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రస్తుత సమాజ అవసరాలకు తగినవిధంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఉపాధే లక్ష్యంగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల పనిచేస్తుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇన్ఫోసిస్, టీసీఎస్, క్యూస్పైడర్, తులసి, ఇంటిగ్రేటెడ్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు, చదువులో ప్రతిభ కనబరిచిన వారికి, క్రీడలలో ప్రతిభను చూపి పతకాలు సాధించిన వారిని ప్రత్యేకంగా అభినందించి బహుమతులను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పాతూరి శ్రీనివాసరావు, ఎంఆర్ శేషగిరిరావు, కే వీరరాఘవులు, హనుమయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఈఈగా ఏడుకొండలు బాధ్యతల స్వీకారం

చిలకలూరిపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఈఈగా పట్టణంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద గల విద్యుత్ శాఖ డివిజన్ ఆఫీసులో ఏడుకొండలు బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో ఇక్కడ విద్యుత్ శాఖ ఏడీఈగా పనిచేశారు.

స్పందనతో సమస్యల పరిష్కారం : తహసీల్దార్

చిలకలూరిపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం జరుగుతుందని చిలకలూరిపేట తహసిల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని ప్రభుత్వశాఖల అధికారులు హాజరవుతారని, మండల ప్రజలు ఆయా శాఖలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే అర్జీలు అందజేసి పరిష్కరించుకోవలసినదిగా ఆయన కోరారు.

నేటి నుంచి యోగ శిక్షణ శిబిరం

చిలకలూరిపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాదినేని చౌదరయ్య స్కూలు ఆవరణలో ఈనెల 10వ తేదీ నుంచి యోగ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరం 28 రోజులు పాటు జరుగుతుంది. కాపుగంటి శివప్రసాద్ గురూజీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరుగుతుంది. ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి 7 వరకు శిబిరం జరుగుతుందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

కుట్టుమిషన్లు, ట్రైసైకిళ్ళ పంపిణీ

చిలకలూరిపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సేవా సంస్థ ఒయాసిస్ ఆధ్వర్యంలో 4 కుట్టుమిషన్లు, ఒక ట్రైసైకిల్‌ను పంపిణీ చేశారు. పేద విద్యార్థికి ఉపకారవేతనాన్ని అందచేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా కేజే ఆసుపత్రి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు. సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.